తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | సోమవారం-15-సెప్టెంబర్-2025 | సంపుటి : 3 | సంచిక : 110 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై సీఎం రేవంత్ సమీక్షా సమావేశం

- జూబ్లీహిల్స్ ఉపఎన్నిక గెలుపు కాంగ్రెస్‌కు అత్యవసరం: సీఎం రేవంత్
- అభ్యర్థి ఎవరైనా గెలిపించే బాధ్యత ఇన్‌చార్జీలదే
- ప్రతీరోజూ కీలకమని, అన్ని వ్యవహారాలను స్వయంగా పర్యవేక్షించనున్న సీఎం
- సంక్షేమ, అభివృద్ధి పనులను ఇంటింటికీ తీసుకెళ్లాలని ఆదేశం
- పోలింగ్ బూత్ వారీగా ప్రచార ప్రణాళికలు సిద్ధం చేయాలన్న దిశానిర్దేశం
- కాంగ్రెస్‌తోనే జూబ్లీహిల్స్ అభివృద్ధి సాధ్యమని ప్రజల్లో నమ్మకం కల్పించాలి
- 21వ తేదీ లోపు 407 బూత్‌లకు పదిమంది చురుకైన కార్యకర్తల ఎంపిక నిర్ణయం



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)


జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజక వర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు చాలా అవసరమని, పార్టీ ఎవరిని అభ్యర్థిగా నిలబెట్టినా గెలిపించాల్సిన గురుతర బాధ్యత ఇన్‌చార్జిలపై ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ ఉప ఎన్నిక కోసం పార్టీ నాయకత్వం ఇప్పటివరకు చాలా బాగా పని చేసిందని, ఇకపై ప్రతీరోజూ కీలకమని, ఈ ఉప ఎన్నికకు సంబంధించిన అన్ని వ్యవహారాలను తానే స్వయంగా పర్యవేక్షిస్తానని ఆయన వెల్లడించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ఆదివారం సాయంత్రం తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, ముఖ్యమంత్రి సలహాదారు

2లో

# భారీ వర్షంతో హైదరాబాద్‌లో విషాదం

- అఫ్జల్‌సాగర్‌లో నాలా దాటుతుండగా మామ–అల్లుడు అదృశ్యం
- పోలీసులు, జీహెచ్‌ఎంసీ, హైడ్రా సిబ్బంది శోధనా చర్యలు
- ముషీరాబాద్‌లో నాలా గోడ కూలడంతో యువకుడు గల్లంతు
- గంటలో 12 సెం.మీ వర్షపాతం – నగరంలో నీటమునిగిన వీధులు
- వర్షపాతం ప్రభావంతో రెస్క్యూ బృందాలు అప్రమత్తం

2లో




# టెట్ ఉత్తీర్ణతపై సుప్రీంకోర్టు తీర్పు

- ఇన్‌సర్వీస్ టీచర్ల ఉద్యోగ భద్రతకు రక్షణ కావాలి – చావ రవి
- విద్యాహక్కు చట్టం సెక్షన్ 23ను సవరించాలన్న డిమాండ్
- టెట్ సిలబస్, అర్హత ప్రమాణాల్లో శాస్త్రీయ మార్పులు అవసరం
- కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని విజ్ఞప్తి
- 2010కి ముందు నియామకమైన టీచర్లకు మినహాయింపు గుర్తుచేసిన నేతలు
- పాత పెన్షన్ పునరుద్ధరణ, ఆదాయపన్ను పరిమితి పెంపు డిమాండ్

7లో






# నిజాం పాలన ఇబ్బందులు ప్రతిబింబించే వర్చువల్ మ్యూజియం అద్భుతం

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

- నిజాం పాలన ఇబ్బందులను ప్రతిబింబించిన వర్చువల్ మ్యూజియం
- త్రిపుర చరిత్రకూ ఇలాంటి ప్రదర్శన అవసరమని గవర్నర్ సూచన
- విమోచన దినోత్సవాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహించిందని కిషన్ రెడ్డి వ్యాఖ్య
- సెప్టెంబరు 17న ప్రజలందరూ త్రివర్ణ పతాకం ఎగరేయాలని పిలుపు

2లో

# తెలంగాణను అంతర్జాతీయ వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతాం: మంత్రి జూపల్లి

- తెలంగాణను వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దే ప్రభుత్వ లక్ష్యం
- పురాతన కోటలు, రాజమహల్స్‌తో ప్రత్యేక గుర్తింపు సాధించే అవకాశాలు
- వెడ్డింగ్ ప్లానర్లకు ఎఫ్‌ఏఎమ్ టూర్లతో ప్రోత్సాహం
- పెట్టుబడుల ఆకర్షణకు పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య విధానాలు



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణను అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ వెడ్డింగ్ డెస్టినేషన్ గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్ లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని అక్షయ కన్వెన్షన్‌లో జరిగిన నాలుగవ సౌత్ ఇండియా వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఈఐ), పర్యాటక శాఖల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

మిగతా 2లో..

# భారత్ ఘన విజయం

## పాక్‌పై వన్‌సైడ్ మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఆధిపత్యం

- స్పిన్ వలలో కూరుకుపోయిన పాకిస్థాన్ బ్యాటర్లు
- భారత్ సులభంగా లక్ష్య ఛేదన
- బౌలర్ల ధాటికి పాక్ 127/9
- టాస్ సమయంలో షేక్ హ్యాండ్ లేకపోవడం చర్చనీయాంశం

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో తీవ్ర ఉద్రిక్తతల మధ్య భారత్-పాకిస్థాన్ మ్యాచ్ ఆసక్తికరంగా జరిగింది. అయితే ఆటలో మాత్రం టీమ్‌ఇండియా తన ఆధిపత్యాన్ని చూపిస్తూ పాక్‌పై వన్‌సైడ్ విజయాన్ని సాధించింది.

7లో




# వరంగల్ కాంగ్రెస్‌లో అంతర్గత ఘర్షణలు

మంత్రి కొండా సురేఖ Vs ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాటల యుద్ధం

- భద్రకాళి ఆలయ పాలకమండలి నియామకంపై వివాదం
- కొండా సురేఖపై నాయిని రాజేందర్ రెడ్డి ఆగ్రహం
- నాయిని వ్యాఖ్యలకు కొండా సురేఖ ఘాటైన ప్రతిస్పందన
- మాటల యుద్ధం తారాస్థాయికి చేరుకున్న కాంగ్రెస్ నేతలు



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో రాజకీయ విభేదాలు భగ్గుమంటున్నాయి. మంత్రి కొండా సురేఖ, తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మధ్య మొదలైన మాటల యుద్ధం రోజురోజుకీ ముదురుతోంది.

మిగతా 2లో..



# ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వ నిర్లక్ష్యం

- ఫీజు బకాయిలతో మూతపడుతున్న విద్యాసంస్థలు
- కోట్ల రూపాయల టెండర్లపై హరీశ్‌రావు ప్రశ్నలు
- అసెంబ్లీలో ఇచ్చిన హామీని తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం
- కరెంట్, వాటర్ బిల్లుల కారణంగా యాజమాన్యాల ఇబ్బందులు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య, మోసపూరిత వైఖరి అనుసరిస్తున్నదని, దీంతో 13 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. రెండేండ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలచేయాలని కాలేజీ యాజమాన్యాలు ఎన్ని విజ్ఞప్తులు చేసినా.. రేవంత్‌రెడ్డి సరారు బకాయిలు విడుదల చేయకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక




## నిజాం పాలన ఇబ్బందులు ప్రతిబింబించే వర్చువల్ మ్యూజియం అద్భుతం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

నిజాం పాలనలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, నాడు జరిగిన ప్రజాపోరాటాలను కళ్లకు కట్టినట్టు చూపించేలా ఏర్పాటు చేసిన వర్చువల్ మ్యూజియం అద్భుతమని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. తన సొంత రాష్ట్రమైన త్రిపుర చరిత్రను కూడా ఈ విధంగా ప్రదర్శించాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రికి సూచన చేస్తానని తెలిపారు. సెప్టెంబరు 17న నిర్వహించనున్న హైదరాబాద్ విమోచన దినోత్సవంలో భాగంగా పరేడ్ గ్రౌండ్‌లో ఫొటో ఎగ్జిబిషన్, వర్చువల్ మ్యూజియంను ఏర్పాటు చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి ఆదివారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ ప్రదర్శనలను ప్రారంభించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహించేలా చొరవ తీసుకున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అభినందనీయులని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ మజ్లిస్ పార్టీకి భయపడి బీఆర్ఎస్, కాంగ్రెస్ విమోచన దినోత్సవాన్ని నిర్వహించలేదని ఆరోపించారు. తాను కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు విమోచన వేడుకల ఆవశ్యకతను ప్రధానికి వివరించానని తెలిపారు. ఈనెల 17న రాష్ట్రంలోని ప్రజలంతా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి విమోచన వేడుకలను ఘనంగా జరపాలనిపిలుపునిచ్చారు. ఎమ్మెల్సీలు ఏవీఎన్ రెడ్డి, మల్క కొమరయ్య, అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై సీఎం రేవంత్ సమీక్షా సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

వేం నరేందర్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య వర్మ, సాంస్కృతిక విభాగం చైర్మన్ వెన్నెల గద్దర్‌తో పాటు పార్టీ డివిజన్ ఇన్‌చార్జులుగా పనిచేస్తున్న కార్పొరేషన్ చైర్మన్‌లు పాల్గొన్న ఈ సమావేశంలో.. ఉప ఎన్నికలో గెలుపునకు అవసరమైన కార్యాచరణపై ముఖ్యమంత్రి, పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు.
పార్టీ నేతలందరూ సమన్వయంతో పనిచేసి, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ సూ చించారు. రాష్ట్ర ప్రభుత్వం అమ లు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి చేరేలా కృషి చేయాలని ఆదేశించారు. 'జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపు కోసం ప్రతీ ఒక్కరు పని చేయాలి. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో ప్రచా రం చేయాలి.



పోలింగ్ బూత్‌ల వారీగా ప్రచార ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి. నియోజకవర్గంలో సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్న భరోసా కల్పించాలి.
కాంగ్రెస్ ప్రభుత్వంతోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించాలి. అభ్యర్థి ఎంపిక విషయం ఏఐసీసీ చూసుకుంటుంది. అభ్యర్థి ఎవరైనా పార్టీ గెలుపు కోసం పనిచేయాల్సిన బాధ్యత మీపై ఉంది. మీ పనితీరు, క్షేత్రస్థాయి పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం తీసుకుంటా. పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి' అని సీఎం స్పష్టం చేశారు. కాగా, ఈనెల 21వ తేదీ కల్లా నియోజకవర్గంలోని 407 పోలింగ్ బూత్‌లలో ప్రతి బూత్‌కు పదిమంది చురుకైన కార్యకర్తలను ఎంపిక చేసి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనేలా చూడాలని సమావేశంలో నిర్ణయించారు.



# వరంగల్ కాంగ్రెస్‌లో అంతర్గత ఘర్షణలు

(మొదటి పేజీ తరువాయి)ల

అదృష్టం కొద్దీ నాయిని రాజేందర్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారని కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. కొండా సురేఖలా పూటకో పార్టీ మారితే నేను కూడా ఐదు సార్లు ఎమ్మెల్యే అయ్యేవాడినని సెటైర్లు వేశారు. ఈ మేరకు ఒక వీడియోను రిలీజ్ చేశారు.
మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మధ్య భద్రకాళి ఆలయ పాలకమండలి కమిటీ చిచ్చు రేపింది. ఈ నేపథ్యంలో కొండా సురేఖ వ్యవహార శైలిపై నాయిని రాజేందర్ రెడ్డి మండిపడ్డారు. తాము ఏది చేసినా నడుస్తోందని కొండా సురేఖ అనుకుంటున్నారని ధ్వజమెత్తారు. స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకుండా భద్రకాళి ఆలయ పాలకమండలిని ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. దేవాదాయ శాఖకు మంత్రి అయినంత మాత్రాన ఏదైనా చేయొచ్చా అని నిలదీశారు. అయినా నా నియోజకవర్గంలో ఆమె పెత్తనమేంటని అని ప్రశ్నించారు. మంత్రి కొండా సురేఖ ఇదే పద్ధతి అవలంబిస్తే చూస్తూ ఊరుకోనని హెచ్చరించారు. అంతా మంత్రి చేశాక స్థానికంగా తాను ఉన్నది దేనికని, తన ఓపికకు పరీక్ష పెట్టవద్దని హెచ్చరించారు. ఈ విషయంలో కొండా సురేఖపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు.
నాయిని వ్యాఖ్యలపై కొండా సురేఖ కూడా అంతే ఘాటుగా స్పందించారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. నాయిని రాజేందర్ రెడ్డి అదృష్టం కొద్దీ ఎమ్మెల్యేగా గెలిచారని అన్నారు. నాయిని రాజేందర్ రెడ్డిపై తాను వ్యాఖ్యలు చేయదలచుకోలేదని వ్యాఖ్యానించారు. అయినా తనకన్నా ముందు ఎమ్మెల్యే కావాలనుకున్న వ్యక్తి ఇప్పుడు అయ్యాడని విమర్శించారు. దేవాదాయ శాఖ మంత్రి హోదాలో గుడిలో ఇద్దరు ధర్మకర్తలను భర్తీ చేసే స్వేచ్ఛ తనకు లేకపోవడం బాధాకరమని అన్నారు. ఆ భర్తీ చేసిన పోస్టులు కూడా అధిష్ఠానం పంపించిన పేర్లే అని ఆమె వివరించారు. నాయిని రాజేందర్ రెడ్డి తనపై చేసిన వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని తెలిపారు. ఈ నేపథ్యంలోనే నాయిని మరోసారి కొండా సురేఖపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇలా ఇద్దరి మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరుకుంది.

## నేడు బిహార్‌లో ప్రధాని పర్యటన

ప్రధాని మోదీ సోమవారం బిహార్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన పుర్నియాలో జరిగే భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా రూ.36 వేల కోట్ల విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. పుర్నియాలో కొత్తగా అభివృద్ధి చేసిన విమానాశ్రయం టెర్మినల్‌ను ఆయన ప్రారంభిస్తారు. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన నేషనల్ మఖానా బోర్డును ప్రధాని ప్రారంభిస్తారు. మఖానాను సూపర్‌ఫుడ్‌గా పలుమార్లు ప్రధాని మోదీ పేర్కొనడం తెల్సిందే. దేశంలో ఉత్పత్తయ్యే మఖానాలో అత్యధికంగా 90 శాతం మేర బిహార్‌లో సాగవుతోంది.
మరికొద్ది నెలల్లో జరిగే ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే మరోసారి అధికారం చేపట్టాలని భావిస్తోంది. అందుకే ప్రధాని మోదీ బిహార్‌కు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. గత 11 ఏళ్లలో బిహార్ అభివృద్ధికి ప్రధాని మోదీ రూ.1.50 లక్షల కోట్ల ప్రాజెక్టులను మంజూరు చేశారని బీజేపీ సీనియర్ నేత, రాష్ట్ర డెప్యూటీ సీఎం సమ్రాట్ చౌధరి తెలిపారు. తమ రాష్ట్రం డబుల్ ఇంజిన్ సర్కార్ ఫలాలను అందుకుంటోందన్నారు.

# భారీ వర్షంతో హైదరాబాద్‌లో విషాదం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

భారీ వర్షం హైదరాబాద్ లో విషాదం నింపింది. ఆసిఫ్‌నగర్ అఫ్జల్‌సాగర్‌లోని మంగారుబస్తీలో ఇద్దరు గల్లంతు అయ్యారు. నాలాలో మామ, అల్లుడు కొట్టుకుపోయారు. విషయం తెలిసిన వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు, జీహెచ్‌ఎంసీ, హైడ్రా సిబ్బంది.. మామ, అల్లుడు కోసం గాలిస్తున్నారు. అఫ్జల్‌సాగర్ నాలాను దాటే క్రమంలో అదుపుతప్పి నాలాలో పడిపోయినట్లు పోలీసులు నిర్ధారించారు. మరోవైపు నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం నుంచి భారీ వర్షం కురిసింది. గంట వ్యవధిలోనే దాదాపు 12 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. అలాగే, ముషీరాబాద్‌లోనూ ఓ యువకుడు నాలాలో కొట్టుకుపోయాడు. నాలాపై ఉన్న గోడపై కూర్చొని ఉండగా, గోడ కూలడంతో సన్నీ (24) గల్లంతయ్యాడు. సన్నీ కోసం కూడా అధికారులు ముమ్మరంగా గాలిస్తున్నారు.



## తెలంగాణను అంతర్జాతీయ వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతాం: మంత్రి జూపల్లి



(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భారతదేశం వెడ్డింగ్ డెస్టినేషన్‌గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతోందని, ఈ రంగంలో తెలంగాణ కీలక పాత్ర పోషించనుందని అన్నారు. పురాతన కోటలు, రాజమహల్స్, దట్టమైన అడవులు, నదులు, సరస్సులు, కొండలు, ఆధునిక విలాసవంతమైన హోటళ్లు వంటి అద్భుతమైన ప్రదేశాలు తెలంగాణలో ఉన్నాయని, ఇవి రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురాగలవని చెప్పారు. వెడ్డింగ్ ప్లానర్లు ఈ ప్రాంతాన్ని కేవలం ఒక రాష్ట్రంగా కాకుండా, ఒక జీవన సంస్కృతిగా చూసి అంతర్జాతీయంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు.
మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, పెళ్లి కేవలం రెండు మనసుల కలయిక మాత్రమే కాదని, రెండు కుటుంబాలు, సంస్కృతుల సమ్మేళనమని అన్నారు. ఈ అపూర్వమైన క్షణాలను పదిలపరుచుకోవడానికి తెలంగాణలోని అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు అనువైనవని తెలిపారు. ఈ రంగాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి వివరించారు. రాష్ట్రంలోని అత్యుత్తమ వెడ్డింగ్ డెస్టినేషన్‌లను ప్లానర్లకు పరిచయం చేయడానికి ప్రత్యేక ఫ్యామిలియరైజేషన్ (ఎఫ్‌ఏఎమ్) టూర్లు నిర్వహిస్తామని, అనుమతులు, లైసెన్సులు, లాజిస్టిక్స్ వంటి ప్రక్రియలను వేగవంతం చేస్తామని చెప్పారు. పబ్లిక్‌ప్రైవేటు భాగస్వామ్యంతో పెట్టుబడులను ఆకర్షించడానికి కొత్త విధానాలను రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. "మీరు ఆలోచించండి, మేము అమలు చేస్తాం" అనే నినాదంతో ముందుకు సాగుతున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్, టీసీఈఐ అధ్యక్షుడు ఆళ్ల బలరాం బాబు, ప్రధాన కార్యదర్శి రవి బురా తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వ నిర్లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)


ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రూపొందించిన 'బిగ్‌డిబేట్' వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆయన తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ, బీఈడీతోపాటు డిగ్రీ, పీజీ వంటి విద్యాసంస్థలు మూతపడే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసే పరిస్థితి వస్తున్నదంటే, విద్యాశాఖ మంత్రిగా కొనసాగుతున్న సీఎం ఏం చేస్తున్నట్టు? అని ప్రశ్నించారు. బకాయిలు విడుదల చేయకపోవడంతో సోమవారం నుంచి నిరసనలు, నిరాహార దీక్షలు, నిరవధిక బంద్‌లు చేయనున్నట్టు యాజమాన్యాలు ప్రకటించినా ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడంలేదని నిలదీశారు. 'అల్లరి చేయొద్దు' అని ఆర్థిక శాఖ మంత్రి సుద్దులు చెప్పినంత మాత్రాన యాజమాన్యాల, విద్యార్థుల గోడు తీరదు కదా అని పేర్కొన్నారు. ఉద్యోగులకు జీతాలు, విద్యార్థులకు ఫీజు బకాయిలు ఇవ్వడానికి లేని డబ్బులు ముఖ్యమంత్రికి కమీషన్ల ప్రాజెక్టులకు ఎలా వస్తున్నాయి, రూ.లక్షల కోట్ల టెండర్లు ఎలా పిలుస్తున్నారని ప్రశ్నించారు. ఫ్యూచర్‌సిటీకి రూ.20వేల కోట్ల టెండర్లు ఒకవైపు కాళేశ్వరం కూలిందంటూనే మరోవైపు, మల్లన్నసాగర్ నుంచి మూసీలో గోదావరి నీళ్లు నింపేందుకు రూ.7,000 కోట్ల టెండర్లు ఎలా పిలుస్తున్నారని హరీశ్‌రావు ప్రశ్నించారు. డబ్బులు లేవంటూనే జీహెచ్‌ఎంసీలో హైలెవెల్ బ్రిడ్జీలు, ఫ్లైఓవర్ల నిర్మాణానికి రూ.7,000 కోట్లు, ఫ్యూచర్‌సిటీలో ఆరు లైన్ల రోడ్డు కోసం రూ.5,000 కోట్లు, హెచ్‌ఎండీఏలో రూ.10,000 కోట్లు, ఆర్ అండ్ బీలో రూ.16 వేల కోట్లు, గురుకులాలను గాలికి వదిలి, రూ.25,000 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు టెండర్లు ఎలా పిలుస్తున్నారని నిలదీశారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పేరుతో రూ.4,400 కోట్ల టెండర్లు, మూసీ సుందరీకరణకు రూ.1.5 లక్షల కోట్ల టెండర్లు.. ఈ విధంగా కమీషన్లు దండుకునేందుకు రూ.2.5 లక్షల కోట్లకు టెండర్లు పిలుస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి విద్యార్థుల చదువుల పట్ల శ్రద్ధ లేదా? విద్యాసంస్థలు ఎదురొంటున్న ఇబ్బందుల పట్ల ఆలోచన లేదా? అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

### మాట తప్పిన సర్కార్

ఫీజు బకాయిల విషయంపై అసెంబ్లీలో తాను ప్రభుత్వాన్ని నిలదీస్తే.. విడతల వారీగా వాటిని విడుదల చేస్తామని, ఏ ఏడాదికి, ఆ ఏడాది క్లియర్ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, సిగ్గు లేకుండా ఇప్పుడు మాట తప్పిందని హరీశ్‌రావు మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెద్దనోట్ల రద్దు, కరోనా వంటి ఎన్నో సవాళ్లు ఎదురైనప్పటికీ, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆపలేదని చెప్పారు. తొమ్మిదిన్నరేండ్ల కేసీఆర్ పాలనలో రూ.20 వేల కోట్లు ఫీజు బకాయిల కింద చెల్లించినట్టు వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పరిస్థితులు తారుమారయ్యాయని దుయ్యబట్టారు. పెద్ద మొత్తంలో ఫీజు బకాయిలు పేరుకుపోవడంతో కాలేజీలు నడిపించలేని దుస్థితి వచ్చిందని, ఇప్పటికే రాష్ట్రంలో సగానికిపైగా జూనియర్, డిగ్రీ కాలేజీలు మూతపడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు.

### కరెంట్, వాటర్ బిల్లులు కట్

సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కరెంట్, వాటర్ కనెక్షన్లను కట్ చేస్తున్నారని, ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేక యాజమాన్యాలు ఇబ్బందిపడుతున్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఒకవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక, మరోవైపు బకాయిలు పేరుకుపోవడంతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు కోర్టుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి వచ్చిందని ఆందోళన



వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ చేతగాని విధానాల వల్ల రాష్ట్రంలో విద్యావ్యవస్థ కుప్పకూలుతుంటే, సీఎం రేవంత్ మాత్రం అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ పాఠశాలల్లో రెండు లక్షల మంది విద్యార్థులు పెరిగారంటూ పచ్చి అబద్ధాలు మాట్లాడారని దుయ్యబట్టారు. యూడైస్ ప్రకారం.. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 47 వేల మంది విద్యార్థులు తగ్గినట్టు తెలిపారు. కేసీఆర్‌పై కక్షతో గురుకులాలను, ఫీజు బకాయిలు చెల్లించకుండా ఉన్నత విద్యా సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి, కమీషన్లు పొందడంపై ఉన్న శ్రద్ధ.. బకాయిలు చెల్లించడంపై లేదని దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వానికి కమీషన్లు దండుకోవడంపై ఉన్న ధ్యాస, విద్యా కమిషన్ ఇచ్చిన రిపోర్టుపై లేదని, విద్యా కమిషన్ చేష్టలుడిగి చూస్తుండటం దారుణమని పేర్కొన్నారు.



## కాలనీ సమస్యల పరిష్కారం కోరుతూ నివాసితుల నిరసన

**మల్కాజిగిరి, సెప్టెంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజిగిరి నియోజకవర్గం గౌతమ్‌నగర్ డివిజన్ పరిధిలోని మీర్జాలగూడ చిన్మయ మార్గ్ కాలనీ వాసులు ఆదివారం రోడ్డుపైకి వచ్చి తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేపట్టారు. నివాసితులు తెలిపిన వివరాల ప్రకారం, హుడా మాస్టర్ ప్లాన్ ప్రకారం 66 అడుగులు ఉండాల్సిన రహదారి కేవలం 15 అడుగులకే పరిమితమైందని, దీంతో కాలనీలోకి అంబులెన్స్, ఫైర్ ఇంజిన్ వంటి అత్యవసర వాహనాలు ప్రవేశించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. అలాగే వర్షాకాలంలో ఎగువ ప్రాంతాల నుండి వచ్చే మురుగు నీరు ఇళ్లలోకి చేరి జీవనాన్ని దయనీయ స్థితికి నెడుతోందని, పలువురు ప్రమాదాలకు గురైన ఘటనలు చోటుచేసుకున్నాయని నివాసితులు తెలిపారు. వారికి అనుగుణంగా రెండు కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన బాక్స్ డ్రైనేజ్ పనులు నాణ్యత లోపించి సక్రమంగా పనిచేయడం లేదని, ఫలితంగా సమస్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసం కాలనీ వాసులు వెంకటేశ్వర స్వామి గుడి నుండి రాజీవ్ గాంధీ విగ్రహం వరకు పాదయాత్ర నిర్వహించి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంధ్య, ఉమామహేశ్వరి, శోభ, కొమరమ్మ, మధు నాయుడు, కరుణాకర్, బాలుజీ నాయక్, వెంకటేష్, అవినాష్ పుడి, విద్య, మహాలక్ష్మి, జంగాల శ్రీరామ్ యాదవ్ తదితరులు మాట్లాడుతూ రహదారి విస్తరణ, మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం తీసుకురావాలని కోరారు. కాలనీ వ్యవస్థాపకుడు జంగాల శ్రీరామ్ యాదవ్ మాట్లాడుతూ – "ప్రభుత్వ ప్రతినిధులు కాలనీ సమస్యలపై చర్యలు తీసుకోకపోతే నిరవధిక దీక్షలు చేపట్టడం తప్పదని" తెలిపారు.



## మేధస్సుతో ఆడే క్రీడ చదరంగం

**లాలాపేట్, సెప్టెంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు):**

విద్యార్థులలో ఆలోచన శక్తిని పెంపొందించే క్రీడ చదరంగమని, ప్రతి పాఠశాలలో ఈ క్రీడను ప్రోత్సహించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డా. రామచందర్ రావు పిలుపునిచ్చారు. లాలాపేట్‌లో ఆదివారం ప్రారంభమైన "తెలంగాణ ఓపెన్ చిల్డ్రన్ చెస్ టోర్నమెంట్" లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు క్రీడాకారులు కోనేరు హంపి, పెంటాల హరికృష్ణ, ద్రోణవల్లి హారిక వంటి అంతర్జాతీయ స్థాయి ఆటగాళ్లను ఆదర్శంగా తీసుకుని పిల్లలు చదరంగంలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ డైరెక్టర్ నిషా ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. టోర్నమెంట్ నిర్వాహకుడు శ్రీరామ్ మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుండి కూడా మొత్తం 350 మంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. విజేతలకు ట్రోఫీలతో పాటు మొత్తం రూ.1 లక్ష నగదు బహుమతి అందజేయ బడుతుందని, పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు చెప్పారు. చదరంగం కేవలం ఆట మాత్రమే కాకుండా మేధస్సును పదును పెట్టే విద్యగా భావించాలని, ఇలాంటి టోర్నమెంట్‌ల ద్వారా మరిన్ని అంతర్జాతీయ స్థాయి ఆటగాళ్లు తయారవుతారని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## కీసర మండలంలో ఘనంగా 188వ జ్ఞానమాల కార్యక్రమం

**కీసర, సెప్టెంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** కీసర మండల అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో వారానికి ఒకసారి జరుగుతున్న జ్ఞానమాల కార్యక్రమం ఈ ఆదివారం 188వ వారంలో ఘనంగా జరిగింది. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమానికి సంఘం అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్ నేతృత్వం వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ఎఫ్‌సి రిటైర్డ్ ఎంప్లాయ్ పూంద్రు కృష్ణ మాట్లాడుతూ "డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రపంచంలోనే గొప్ప మేధావి. ఆయన ఆశయాలను అందరూ ముందుకు తీసుకెళ్లాలి. విద్యార్థులు, యువత తప్పు దారి పట్టకుండా క్రీడలలో, విద్యలో రాణించాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో కీసర మండల అంబేద్కర్ సంఘం సంయుక్త కార్యదర్శులు కట్ట శంకరయ్య, కంచే మీది సంతోష్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గుర్రం శ్రీధర్ రెడ్డి, మాజీ వార్డ్ సభ్యుడు శీలం



మల్లేష్, బీఆర్ఎస్ పార్టీ కీసర గ్రామ శాఖ అధ్యక్షుడు చినింగని బాల్‌రాజ్, మేడ్చల్ నియోజకవర్గ జర్నలిస్ట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కర్రె గణేష్, పీపుల్స్ డైరీ రిపోర్టర్ తుడుం బాలకృష్ణ, కీసర గుట్ట మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు రాగుల రమేష్ ముదిరాజ్, అలాగే తుడుం ఆగమయ్య, రాజలింగం ముదిరాజ్, ఎర్ర సాయిలు, తుడుం బాల్‌రాజ్, పూంద్రు మల్లేష్, పూంద్రు రాఘవేందర్, కుంటోల్ల శ్రీనివాస్, నర్సింగ్ టోనీ, నవీన్ కుమార్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.






## టైలర్స్‌కు ఇచ్చిన ఇళ్ల స్థలాలకు రక్షణ కల్పించండి

**ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి ఆదుకోవాలి**

**దౌర్జన్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి**

**విలేకరుల సమావేశంలో టైలరింగ్ వర్కర్స్ యూనియన్ మాజీ అధ్యక్షులు ఆవుల నాగేశ్వరరావు**

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 14, తెలంగాణ ముచ్చట్లు;**

ఖమ్మంలోని శ్రీనివాస్ నగర్ లో టైలరింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాలకు రక్షణ కల్పించాలని, ప్రభుత్వ హామీ మేరకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని టైలరింగ్ వర్కర్స్ యూనియన్ మాజీ అధ్యక్షులు ఆవుల నాగేశ్వరరావు కోరారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆవుల నాగేశ్వరరావు, యూనియన్ సభ్యులు మాట్లాడుతూ.. ఖమ్మం నగరంలోని శ్రీనివాస్ నగర్ కు చెందిన టైలరింగ్ వర్కర్స్ కు 303, 304 సర్వే నెంబర్లలో 108 మందికి అప్పటి అర్బన్ ఎమ్మార్వో పట్టాలు ఇచ్చారని తెలిపారు. అట్టి స్థలములో ఇండ్లు నిర్మించుకోవడానికి ఎలక్ట్రిసిటీ కానీ, రోడ్లు కానీ, వాటర్ సౌకర్యం కాని లేకపోవడంవల్ల కొంత ఆలస్యమైందన్నారు. అయినప్పటికీ కొంతమంది ఎంతో ఖర్చుచేసి 30 ఇండ్లు, 80 బేస్మెంట్స్ నిర్మించుకున్నారని తెలిపారు. ఇళ్ల స్థలాలకు ఎటువంటి సంబంధంలేని అమృతం శ్రీనివాస్ అర్ధరాత్రి ప్రోక్లైన్లతో కట్టిన ఇండ్లు, బేస్మెంట్స్ అన్ని కూల్చివేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. అది స్థలంలో అర్ధరాత్రి మట్టి పోశారని వాపోయారు. అదేవిధంగా మళ్ళీ నిర్మించుకున్న ఇండ్లను కూడా కూల్చివేశారని తెలిపారు. పోలీస్, రెవిన్యూ అధికారులకు పదే పదే ఫిర్యాదు చేసిన కాలయాపన చేస్తున్నారే తప్ప పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అమృతం శ్రీనివాస్ కు చెందిన కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు హల్ చల్ చేస్తున్నారని తెలిపారు. ఇట్టి విషయమై ఇందిరమ్మ ఇండ్ల కోసం మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళామని సహాయం చేస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. జిల్లా అధికారులు సమగ్ర విచారణచేసి ప్రభుత్వం ఇచ్చిన లేఅవుట్ మ్యాప్ కు ఆధారంగా హద్దులు నిర్ణయించి మా ఇళ్ల స్థలాలు మాకు అప్పగించి న్యాయం చేయాలని వారు వేడుకున్నారు. ఈ విలేకరుల సమావేశంలో సిహెచ్.ఎం సుశీల, వి. నరసింహారావు, రచ్చ రామారావు, ఎం.ఎస్ కుమార్, కళావతి, పాల్గొన్నారు.





## రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ చాటుతూ జిల్లాకు పేరు తీసుకురావాలి – ఎమ్మెల్యే జారె

### అండర్-16 కబడ్డీ సెలక్షన్ పోటీలకు ఘన ఆరంభం!

**దమ్మపేట, సెప్టెంబర్ 14(తెలంగాణ ముచ్చట్లు):**

జిల్లా స్థాయి అండర్16 కబడ్డీ సెలక్షన్ పోటీలు పురుషులు, మహిళల విభాగాల్లో ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం ప్రకాశం మైదానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ మరియు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హాజరై ఆరంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు కబడ్డీ కీలకమని తెలిపారు. "కబడ్డీ ఆట మన సంప్రదాయ బలం, ధైర్యానికి ప్రతీక. ఈ పోటీల్లో ప్రతిభ కనబరచిన అబ్బాయిలు, అమ్మాయిలు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో మెరిసి మన జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి" అని పిలుపునిచ్చారు. ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని, ఆటగాళ్లకు సదుపాయాలు, ప్రోత్సాహకాలు అందించేందుకు కృషి చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ నాయకులు, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు





## స్వయం ఉపాధినీ ఎంచుకొని జీవితంలో ఎదగాలి

**వెల్టూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి**

**పెద్దమందడి, సెప్టెంబర్14(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామానికి చెందిన ఆంజనేయులు న్యూ ఎస్సీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన టీ స్టాల్‌ను ఆదివారం మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి వైపు దృష్టి సారించాలని, తమ నైపుణ్యాలు, శ్రమను వినియోగించి జీవితంలో ఎదగాలని పిలుపునిచ్చారు. స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్వావలంబనతో పాటు సమాజంలో గౌరవం, ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుర్వ భాల చంద్రయ్య, జి. చంద్రశేఖర్ రెడ్డి (ఇందిరమ్మ కమిటీ సభ్యులు), దిండు రవీందర్ (వార్డు సభ్యులు), మల్లికార్జున్ (మాజీ ఉప సర్పంచ్), జి. ఆంజనేయులు (ఇందిరమ్మ కమిటీ సభ్యులు), వద్దే శేఖర్ (ఇందిరమ్మ కమిటీ సభ్యులు), ఐ. సుదర్శన్ రావు (అధ్యాపకులు), పి. సత్యన్న, సుద్దబాయి రాజు, డి. జయరాజు, కావలి రాజు, నాగభూషణ్, కె. కొండన్న, పి. రాములు, ఎ. రాములు, దయ్యాల శేఖర్, ఖాజా హుస్సేన్, కొత్త బాలస్వామి, బీరప్ప తదితరులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**హనుమకొండ, సెప్టెంబర్14(తెలంగాణ ముచ్చట్లు):**

హనుమకొండ ఆర్.డి. కోఆపరేటివ్ జూనియర్ కళాశాల 1999-2001 (సీఈసీ) పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. దాదాపు ఇరవై సంవత్సరాల తర్వాత మళ్లీ ఒక్కచోట చేరిన పూర్వ విద్యార్థులు కాలేజీ జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందభరిత క్షణాలను పంచుకున్నారు.




ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ, "ఆ కాలం మాకు కేవలం విద్య నేర్పిన రోజులు మాత్రమే కాదు, గురువుల పట్ల గౌరవం, విలువల పాఠాలు అందించిన బంగారు కాలం" అని భావోద్వేగంగా గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపన్యాసకులు పూర్వ విద్యార్థుల విజయాలను ప్రశంసిస్తూ, సమాజంలో వారు సాధించిన స్థానం గర్వకారణమని పేర్కొన్నారు. గురువులకు విద్యార్థులు ఘన సత్కారం అందించారు. సమ్మేళనంలో మిత్రులలో ఎవరికైనా ఆపద వచ్చినా పరస్పరం ఆదుకోవాలని, సమాజానికి మరింత సేవ చేయాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. ప్రస్తుత విద్యార్థులకు మార్గదర్శకులుగా నిలిచి తమ వంతు సహకారం అందిస్తామని సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రామ్మూర్తి, ఉపన్యాసకులు మహేష్, కృష్ణ మీనన్, సుధాకర్, రవీందర్ రెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# జాతీయ లోక్ అదాలత్ ద్వారా 4625 కేసులు పరిష్కారం

**పోలీస్ కమిషనర్ సునీల్ దత్**



**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 14, తెలంగాణ ముచ్చట్లు;** జిల్లావ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ కు విశేష స్పందన లభించిందని, వీటి ద్వారా 4625 కేసులు పరిష్కారమయ్యాయని, సైబర్ క్రైమ్ కేసుల్లో 52 లక్షలకు పైగా రిఫండ్ మొత్తాన్ని బాధితులకు అందజేశారని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా రాజీకి అవకాశం ఉండి పరిష్కరించిన 4625 కేసుల్లో ఎఫ్ఐఆర్ కేసులు 712, ఈ పెట్టి కేసులు 775, డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసులు 2972, మైనర్ డ్రైవర్ కేసులు 8, సైబర్ కేసులు 158 పరిష్కరించడం ద్వారా 52,11,246 రూపాయలు బాధితులకు అందజేశారని తెలిపారు. రాజీ మార్గం రాజ మార్గమని, లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాలకు న్యాయం జరుగుతుందని అవగాహన కల్పించి కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీస్ అధికారులను, సిబ్బంది పోలీస్ కమిషనర్ అభినందించారు. అదేవిధంగా లోక్ అదాలత్ సద్వినియోగం సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయసేవాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# నాగారం వి.ఎస్.టి కాలనీలో సమస్యలపై సమావేశం



**నాగారం, సెప్టెంబర్ 14(తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ నియోజకవర్గం కీసర మండలం నాగారం మున్సిపల్ పరిధిలోని వి.ఎస్.టి కాలనీ పార్కులో ఆదివారం కాలనీ అసోసియేషన్ సభ్యులు ఏర్పాటు చేసిన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి కాలనీలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీ అభివృద్ధి కోసం అవసరమైన మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా రోడ్ల మరమ్మతులు, కాలువల శుభ్రత, వీధి దీపాల మరమ్మతులు వంటి సమస్యలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అలాగే, కాలనీలో సాంఘిక, సాంస్కృతిక కార్యక్రమాల కోసం నూతన కమిటీ హాల్ నిర్మాణం అవసరాన్ని అసోసియేషన్ సభ్యులు ప్రస్తావించగా, దానిపై కూడా త్వరలో చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో వి.ఎస్.టి కాలనీ అధ్యక్షులు మనోహర్, కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు. సమావేశం విజయవంతంగా ముగిసింది.

# ఇండియాన్ రిపోర్టర్స్ అసోసియేషన్ తెలంగాణ జాయింట్ సెక్రటరీగా బైరపాక మహేష్

- రాష్ట్ర అధ్యక్షులు శరత్ చంద్ర ఉత్తర్వులు జారీ
- నమ్మకం ఉంచి పదవి ఇచ్చిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపిన మహేష్
- సంఘ బలోపేతానికి కృషి చేస్తానని మహేష్ హామీ
- జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్న మహేష్



**జనగాం,సెప్టెంబర్14(తెలంగాణ ముచ్చట్లు):** ఇండియాన్ రిపోర్టర్స్ అసోసియేషన్ (ఐఆర్ఏ) తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా జనగాం జిల్లా హిమ్మత్ నగర్ కు చెందిన బైరపాక మహేష్ నియమితులయ్యారు.ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు శరత్ చంద్ర ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.
తన నియామకంపై స్పందించిన మహేష్, “నాపై నమ్మకం ఉంచి ఈ పదవీ బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు శరత్ చంద్ర, జాతీయ కమిటీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. జర్నలిస్టుల సంక్షేమమే నాకు ప్రథమ కర్తవ్యం. సంఘం బలోపేతం, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాను. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి అన్ని సమస్యలను తీసుకెళ్లి తగిన పరిష్కారం కోసం పోరాడతాను” అని స్పష్టం చేశారు.
మహేష్ తన నియామకాన్ని జర్నలిస్టు సమాజానికి అంకితం చేస్తూ, “ఈ పదవి నాకు గౌరవం మాత్రమే కాదు బాధ్యత కూడా. సహచర జర్నలిస్టుల అండతో ముందుకు సాగుతూ ఐఆర్ఏ ప్రతిష్ఠను పెంచుతాను” అని నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

# నిచ్చెయ్ ఎన్రోల్‌మెంట్ బాధ్యత ఎవరిది..?

**ఆశాలపై వేధింపులు ఆపాలి : సీఐటీయు మేడ్చల్ జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణన్**



**చర్లపల్లి, సెప్టెంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలోని అన్ని జిల్లాలలోనూ నిచ్చెయ్, ఎన్రోల్‌మెంట్ పనులు ఏఎన్ఎంలు నిర్వహిస్తుంటే, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో మాత్రం ఆ పనులు ఆశా వర్కర్లపై మోపడం అన్యాయమని సీఐటీయు జిల్లా కోశాధికారి కె. ఉన్నికృష్ణన్ తీవ్రంగా విమర్శించారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ - “ఇప్పటికే అడల్ట్ బీసీజీ సర్వే పూర్తి చేసి సంవత్సరం గడిచినా, వాగ్దానం చేసిన పారితోషికం ఆశాల ఖాతాల్లో జమ కాలేదు. అయినప్పటికీ ఇప్పుడు అధికారుల ఒత్తిడితో బీసీజీ టీకాల ఆన్లైన్ నమోదు చేయాలని బలవంతం చేస్తున్నారు. ఇది ఆశా వర్కర్లకు తీవ్ర వేధింపుల్లాంటిదే” అని పేర్కొన్నారు.యువిన్, ఎన్‌సీడీ స్క్రీనింగ్, ఐహెచ్ఐపీ, ఈసంజీవని ఓపీ వంటి అన్ని ఆన్‌లైన్ పనులు ఇతర జిల్లాలలో ఏఎన్ఎంలు చేస్తుంటే, మేడ్చల్‌లో మాత్రం ఆశాలపై మోపడం దారుణమని అన్నారు. “చేయకపోతే తీసేస్తాం” అంటూ అధికారులు బెదిరించడం ఖండనీయమని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.“ఆశాలను చదువుకోని వారినీ ఎంపిక చేశారు. అలాంటప్పుడు వారిపై ఇలాంటి ఆన్లైన్ పనులు మోపడం అన్యాయం. ఫిక్స్‌డ్ వేతనం లేకుండా ఎన్ని రోజులు ఇలా పనులు చేయిస్తారు..? ఆశాల అసలు బాధ్యతలు ఆశాలతోనే పరిమితం చేయాలి. అదనపు భారాలు మోపరాదు” అని ఉన్నికృష్ణన్ స్పష్టం చేశారు.సమస్యలు పరిష్కరించకపోతే పోరాటానికి వెనుకాడబోమని సీఐటీయు తరపున హెచ్చరించారు.






# మౌలాలి చౌరస్తా వద్ద ఈద్-ఎ-మిలాద్ ఉన్ నబి సందర్భంగా శోభయాత్ర, షర్బత్ పంపిణీ

**మౌలాలి, సెప్టెంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి నియోజకవర్గం 138 మౌలాలి డివిజన్ లో ఎం.జె. కాలనీ పరిధిలోని మజీద్ఎమహమ్మదీయ బేగం ఆధ్వర్యంలో ఈద్ఎమిలాద్ ఉన్ నబి సందర్భంగా శోభాయాత్ర ఆదివారం ఉత్సాహంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా మౌలాలి చౌరస్తా వద్ద ప్రతి సంవత్సరం మాదిరిగానే భక్తులు, ప్రజలకు ఉచితంగా షర్బత్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.
గత 12 సంవత్సరాలుగా నిరంతరంగా కొనసాగుతున్న ఈ కార్యక్రమం స్థానికుల మధ్య ప్రత్యేక ఆకర్షణగా మారింది. చిన్నారులు, యువత, వృద్ధులు అందరూ సమానంగా పాల్గొని జులూస్ కు ప్రత్యేక ఆకర్షణను తీసుకొచ్చారు.ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా 138వ డివిజన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ పోతుల వినోద్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు షకీల్ హాజరై ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. నిర్వాహకులుగా నజీర్ ఖాన్, అబ్బాస్, ఐజాజ్ సామీ, షాకీర్ బాబా, మెహబూబ్, ఇంతియాజ్ అహ్మద్, అస్లాం తదితరులు బాధ్యతలు స్వీకరించారు.ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఐక్యత, సోదరభావానికి నిదర్శనంగా ఈ వేడుకను విజయవంతం చేశారు. స్థానిక మత పెద్దలు కూడా ఈ సందర్భంగా మతసౌహార్దం, శాంతి, ఐక్యత ప్రాధాన్యతను గుర్తుచేశారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి,సెప్టెంబర్14(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ఆదివారం వనపర్తి పట్టణంలోని ఆర్జి గార్డెన్‌లో జరిగిన మునీర్ కుమార్తె వివాహ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, కుటుంబ సభ్యులతో ఫోటోలు దిగారు.
తరువాత పెద్దమందడి మండలం జగత్పల్లి గ్రామానికి చెందిన శేషు, శారదల కుమార్తె చిన్నారి కీర్తన పుష్పాలంకరణ కార్యక్రమానికి హాజరై చిన్నారిని దీవించారు. అనంతరం జగత్పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకుడు గట్టు యాదవ్ ఇంటిని సందర్శించి, స్థానిక నాయకులు, కార్యకర్తలతో పలు అంశాలపై చర్చించారు.ఈ కార్యక్రమాల్లో వనపర్తి పట్టణ, పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# అన్నపూర్ణ ఈస్ట్ కాలనీకి త్వరలో అప్రోచ్ రోడ్డు

## నెమలి అనిల్ కుమార్ భరోసా

**మల్లాపూర్, సెప్టెంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ ఈస్ట్ కాలనీలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. కాలనీలో గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ పర్యటించి, జరుగుతున్న బాక్స్ డ్రెయిన్ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు.
ఈ సందర్భంగా అన్నపూర్ణ ఈస్ట్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను కలుసుకుని, చట్నీ బౌల్ హోటల్ పక్కన ఉన్న మెయిన్ రోడ్ నుండి స్ట్రీట్ నం.6 మీదుగా తమ కాలనీకి అప్రోచ్ రోడ్డును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాలనీలో వందలాది కుటుంబాలు నివసిస్తున్న నేపథ్యంలో, రహదారి లేకపోవడం వలన వర్షాకాలంలో రాకపోకలు తీవ్రంగా అంతరాయం కలుగుతున్నాయని వారు వివరించారు.కాలనీవాసుల సమస్యలను శ్రద్ధగా విన్న నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ, “కాలనీలోని ప్రతి సమస్యను దశలవారీగా పరిష్కరిస్తాం. ముఖ్యంగా అప్రోచ్ రోడ్డు అవసరాన్ని అర్థం చేసుకున్నాం. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో అధికారులతో మాట్లాడి, రహదారి మంజూరయ్యేలా కృషి చేస్తాం” అని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి.ఎస్.ఎన్. చౌదరి, అన్నపూర్ణ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కటర్ల శేఖర్ బాబు, నాయకులు భాను చందర్ రెడ్డి, ఎం.డి. నధీమ్, విలయత్ ఖాన్, లక్ష్మీపతి, ప్రదీప్, రఘు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# నేరడలో సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 14, తెలంగాణ ముచ్చట్లు;** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక & విద్యుత్, ప్రణాళిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సిఫారసు మేరకు చింతకాని మండలం నేరడ గ్రామానికి చెందిన తాళ్లూరి మల్లిక కు 14,000/ వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ నుండి మంజూరైన చెక్కును ఆమెకు అందజేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు షేక్ దస్తగిరి మట్టా రవి గోగుల వెంకట్రారావు ఆందోని మట్టా క్రిష్ణ పులిపాటి వీరభద్రం వెంకన్న అన్నపురెడ్డి గురుమూర్తి మట్టా సీతారాములు సీతయ్య ప్రసాద్ నరేష్ నర్సింహారావు పరికపల్లి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



# చండీశ్వర్ నగర్ కాలనీలో కొత్త కమాన్ ప్రారంభం

**మాజీ చైర్మన్ చంద్రారెడ్డి**

**నాగారం, సెప్టెంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు) :** మేడ్చల్ నియోజకవర్గం కీసర మండలం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని చండీశ్వర్ నగర్ కాలనీలో కొత్తగా నిర్మించిన కమాన్‌ను ఘనం గా ప్రారంభించారు. ఈ కమాన్ ఓపెనింగ్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాగారం మాజీ చైర్మన్ చంద్ర రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్, నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు .ఈ కార్యక్రమం లో మెరుగు శ్రీనివాస్ రెడ్డి, అలాగే కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు. అతిథులు మాట్లాడుతూ - కాలనీలో అభివృద్ధి పనులు జరుగుతున్న తీరు సంతోషకరమని, భవిష్యత్తులో కూడా మౌలిక వసతుల కోసం అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు.కాలనీ నివాసులు కమాన్ నిర్మాణంతో తమ ప్రాంతానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఏర్పడిందని ఆనందం వ్యక్తం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక







# పలు వివాహ వేదికల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించిన డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

**వనపర్తి,సెప్టెంబర్14(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ఆదివారం వనపర్తి పట్టణంలోని పలు వివాహ వేదికల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

వనపర్తి పట్టణం 6వ వార్డుకు చెందిన ఎండి అక్బర్ కుమార్తె వివాహం స్టార్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ వివాహ వేడుకలో పాల్గొన్న డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

అలాగే వనపర్తికి చెందిన మునీర్ కుమార్తె వివాహం ఆర్‌జి గార్డెన్‌లో జరిగింది. ఈ వేదుకలోనూ ఆయన పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సమద్ మియా, జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షులు ఎండి ఇర్షాద్, పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.





# ఖమ్మంలో 'ఇన్నోవేట్ ది ఇన్నర్ సెల్ఫ్' ఆధ్యాత్మిక సభాకార్యక్రమం

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 14, తెలంగాణ ముచ్చట్లు:**


"మానవతా రక్షతి రక్షితా:" నినాదంతో, మానవతా సమాజ స్థాపనే లక్ష్యంగా ఆధ్యాత్మిక విశ్వ గురువు శ్రీ గురు విశ్వస్ఫూర్తి ఆశీస్సులతో, వారి భక్తులు "స్ఫూర్తి కుటుంబం తెలంగాణ" ట్రస్ట్ ఏర్పాటు చేసి, పలు సామాజిక ఆధ్యాత్మిక కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఆ క్రమంలోనే ట్రస్ట్ ఆధ్వర్యంలో, ఖమ్మం పట్టణంలోని శ్రీ నగర్ కాలనీలోని ఎస్. ఆర్. కన్వెన్షన్ ఫంక్షన్ హాలులో, ' ఇన్నోవేట్ ది ఇన్నర్ సెల్ఫ్' పేరుతో సభా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అథిదిగా గవర్నమెంట్ ఐటిఐ కాలేజీ ప్రిన్సిపాల్ ఏ. శ్రీనివాస్ హాజరయ్యారు. సభనుద్దేషించి వారు మాట్లాడుతూ, నేటి బాలలే రేపటి పౌరులనీ, మానవతా విలువలు, మంచి అలవాట్లు బాల్యంలోనే చొప్పించాలని తెలియజేసారు. స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ద్వారా మానవత్వాన్ని ప్రచారించడం హర్షించదగ్గర విషయమని కొనియాడారు.

శ్రీ గురు విశ్వస్ఫూర్తి వారు సుమారు నాలుగు పదుల గ్రంథాలు రచించారు. మనిషి, మానవ సమాజానికి సంబంధించి అన్ని విషయాలు, అలాగే ఆధ్యాత్మిక సంబందిత విషయాలు, సాధన విధానాలు ఎన్నో పొందుపరచారు. వారందించిన ఆ జ్ఞానభండాగారాన్ని, ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సభా కార్యక్రమాల ద్వారా మానవజాతికి అందిస్తున్నారని తంబూరి దయాకర్ రెడ్డి తెలియజేసారు.

మనిషి, మనసు, జీవితం, కుటుంబం, సమాజం, నేటి బాలల పట్ల కుటుంబ సమాజ బాధ్యత, ప్రాక్టికల్ ఫిలాసఫీ, రిలీజియస్ హ్యూమానిటీ అనే అంశాలపై సభికులు ఉపన్యసించారు. మానవత్వం ఆచరణలో తీసుకురావాలని, ప్రతి మనిషి సాటి మనిషిని, మనిషిగ గుర్తుంచి, గౌరవించడం మానవత్వం అని, దాన్ని ఆచరణలో నిరూపించు కోవాలని, మానవత్వ సమాజ స్థాపన అనే మహా యజ్ఞం కొరకు అందరూ భాగస్వామ్యం కావాలని ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఆళ్ళ రాజేష్ గారు పిలుపునిచ్చారు. మనిషిలో పశుత్వం, క్రూరత్వంతో పెరిగి, మానవజాతి మనుగడకే ప్రమాదం పొంచి వున్న నేటి సమాజంలో, మనిషిలో మానవత్వం పెంపొందించాలనీ, సమాజంలో ఆత్మీయత స్థాపన జరగాలనేది శ్రీ గురు విశ్వస్ఫూర్తి ఆశయమని, డిప్యూటీ సివిల్ సర్జన్ డా. రామారావు తెలియజేసారు. ఈ కార్యక్రమానికి ట్రస్ట్ సభ్యులు కె. రాధాకృష్ణ, వి. విక్రమ్, ఎన్. సురేష్, జె. రవింద్రబాబు, రిటైర్డ్ స్కిన్ స్పెషలిస్ట్ డా. విమల, అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీ గోపాల్, జె. వెంకటేశ్వరరావు, జోనల్ ఇంచార్జి శ్రీ ఎన్. రవికుమార్ తదితరులు విచ్చేసి సభలో పాల్గొన్నారు.

# కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు మాదిగల అభివృద్ధికి కృషి చేయాలి

## ఉస్మానియా యూనివర్సిటీలో మాదిగ హక్కుల దండోరా సమావేశం



**తార్నాక, సెప్టెంబర్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** మాదిగల అభివృద్ధి కోసం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకోవాలని మాదిగ హక్కుల జాతీయ అధ్యక్షుడు దండు సురేందర్ మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్ మాదిగ డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ లోని సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ స్టడీస్‌లో ఆదివారం జరిగిన మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు.

నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని తీవ్రంగా విమర్శించారు. "అంబేద్కర్ అభయ హస్తం" పేరుతో రూ.12 లక్షలు ఇస్తామని చెప్పినా ఇప్పటివరకు అమలు కాలేదని, "రాజీవ్ యువ వికాసం" కూడా కేవలం దరఖాస్తుల దశలోనే ఆగిపోయిందని ఆరోపించారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల గమ్యం ఎవరికీ తెలియకపోవడం దురదృష్టకరమన్నారు.

లెదర్ ఇండస్ట్రీ అభివృద్ధి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు తోలు పాదరక్షల ఎగుమతుల ద్వారా వేల కోట్ల ఆదాయం సంపాదిస్తున్నాయని, తెలంగాణలో కూడా లెదర్ ఇండస్ట్రీ పార్కులను పునరుద్ధరిస్తే పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు సృష్టించవచ్చని సూచించారు. ఈ పార్కుల ద్వారా ఐదు లక్షల మందికి ప్రత్యక్షంగా, పది లక్షల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని చెప్పారు. ముఖ్యంగా లిడ్ క్యాప్ భూములను కబ్జాలకు గురికాకుండా రక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.విద్య, ఉపాధి సమస్యలు బలహీన

వర్గాల విద్యార్థుల కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్ ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్ పి ఎస్ సి) నిరుద్యోగ యువతతో అన్యాయం చేస్తోందని, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రూప్ 1 విషయంలో హైకోర్టు సూచనలు వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

నాయకుల పాల్గొనడం ఈ సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతల శ్యామ్ మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రకాష్ మాదిగ, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు రేణికుంట్ల కుమార్, నాయకులు సాల్మన్ మాదిగ, కరుణాకర్ మాదిగ, కొలుగురి విజయ్ కుమార్ మాదిగ, పోత్తూరి రమేష్ మాదిగ, ఓయూ విద్యార్థి విభాగం అధ్యక్షుడు బొర్ర శాంతి కుమార్, శ్రీనివాస్ మాదిగ, స్వామి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# బోయింగ్‌కు ఎఫ్ఏఏ మళ్లీ ఫైన్



ప్రముఖ వైమానిక రంగ దిగ్గజం బోయింగ్‌కు అమెరికా నియంత్రణ సంస్థ ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ మరో సారి ఫైన్ విధించింది. భద్రతకు సంబంధించిన చాలా ఉల్లంఘనలను గుర్తించడంతో దాదాపు 3.1 మిలియన్ డాలర్లు (రూ.27.36 కోట్లు) చెల్లించాలని ఆదేశించింది. ఈ ఉల్లంఘనలు మొత్తం సెప్టెంబర్ 2023 నుంచి ఫిబ్రవరి 2024 లోపు చోటు చేసుకున్నవి. అలాస్కా ఎయిర్‌లైన్స్ డోర్ ఊడిపోవడం సహా చాలా సంఘటనలున్నాయి.

వాషింగ్టన్‌లోని రెంటాన్ ఫ్యాక్టరీలో నిర్వహించిన దర్యాప్తులో క్వాలిటీ సిస్టమ్స్‌లో వందల ఉల్లంఘనలు గుర్తించినట్లు ఎఫ్ఏఏ ప్రకటనలో పేర్కొంది. ఇక కెన్సాస్‌లోని బోయింగ్ సబ్‌కాంట్రాక్ట్ సంస్థ స్పిరిట్ ఏరోసిస్టమ్స్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొందని చెప్పింది. రెండు విమానాలు ఎగిరేందుకు అయోగ్యమైనవిగా గుర్తించినట్లు పేర్కొంది. ఇక నాణ్యతలేని విమానానికి ధ్రువీకరణ వచ్చేట్లు సంతకం చేయాలని ఒత్తిడి చేసినట్లు గుర్తించారు. ఈ పెనాల్టీపై స్పందించేందుకు బోయింగ్‌కు 30 రోజుల గడువు ఉంది. ఈ ఏడాది జూన్‌లో 'అమెరికా నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్' 17 నెలల పాటు నిర్వహించిన దర్యాప్తు నివేదికను విడుదల చేసింది. దీనిలో బోయింగ్ తయారీ, భద్రతా పర్యవేక్షణలో చాలా లోపాలు ఉన్నా.. ఎఫ్ఏఏ తనిఖీలు, ఆడిట్స్ ఏమాత్రం ప్రభావం చూపలేదని పేర్కొంది. ఫలితంగానే అలాస్కా ఎయిర్‌లైన్స్ ఘటన చోటు చేసుకొందని వెల్లడించింది. జనవరి 2024 ఘటన విచారకరమని బోయింగ్ ఓ ప్రకటనలో పేర్కొంది. తమ భద్రతా ప్రమాణాలను బలోపేతం చేసుకొంటామని పేర్కొంది. నాణ్యత, బాధ్యతలకు సంబంధించి చర్యలు చేపడతామని చెప్పింది.




# ఐటీ రిటర్నులకు నేడే ఆఖరు తేదీ

గత ఆర్థిక సంవత్సరానికి(202425) గాను ఎలాంటి జరిమానాలు లేకుండా ఆదాయపు పన్ను రిటర్నులు (ఐటీఆర్) దాఖలు చేసేందుకు గడువు నేటితో ముగియనుంది. ఇప్పటికే దాదాపు 6 కోట్లకు పైగా పన్ను చెల్లింపుదారులు ఈ ప్రక్రియను పూర్తి చేసినట్లు ఐటీ విభాగం పేర్కొంది. పన్ను చెల్లింపుదారులకు, పన్ను నిపుణులకు సందేహాలు తీర్చేందుకు 24×7 సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించింది.


ఇవెరిఫై అయిన రిటర్నులు 5.51 కోట్లు ఉన్నాయని, ఇందులో 3.78 కోట్ల వరకూ పరిశీలన పూర్తయ్యిందని పన్ను విభాగం పేర్కొంది. రూ.3 లక్షలకు మించి ఆదాయం ఉన్న వారందరూ త్వరగా రిటర్నులు దాఖలు చేయాలని సూచించింది. కొత్త, పాత పన్ను విధానంలో ఏది ప్రయోజనమో చూసుకోవాలని తెలిపింది. మోసపూరిత మినహాయింపులు చూపించి, రిఫండును కోరడం తప్పు అని, తర్వాత కాలంలో ఇది నోటీసులకు, జరిమానాలకు దారి తీస్తుందని హెచ్చరిస్తోంది.



# న్యూయార్క్‌లో ముకేశ్ భారీ కొనుగోలు..!

రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్, భారత కుబేరుడు ముకేశ్ అంబానీ విదేశాల్లో అత్యంత విలువైన ఆస్తులను కొనుగోలు చేయడం కొనసాగిస్తున్నారు. తాజాగా అమెరికాలోని న్యూయార్క్‌లో అత్యంత విలాసవంతమైన బిల్డింగ్ కొనుగోలు చేసినట్లు సమాచారం. న్యూయార్క్‌లోని ట్రైబెకా ప్రాంతంలో భవంతిని 17.4 మిలియన్ డాలర్లు (సుమారు రూ.145 కోట్లు) వెచ్చించి సొంతం చేసుకున్నట్లు రియల్‌డీల్ తాజా నివేదిక వెల్లడించింది. 2023 ఆగస్టులో మాన్‌హాటన్‌లో హడ్సన్ నదికి ఎదురుగా ఉన్న తన 9 మిలియన్ డాలర్ల విల్లాను విక్రయించిన రెండేళ్లకే అంబానీ ఈ కొత్త భవంతిని కొనుగోలు చేశారు. ఈ భవనాన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎస్) అమెరికా విభాగం కొనుగోలు చేసింది. దీన్ని టెక్ బిలియనీర్ రాబర్ట్ పెరా 2018లో దాదాపు 20 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేసి, లగ్జరీ రెసిడెన్స్‌గా మార్చాలని ప్రణాళికలు చేశారు. కానీ అమలు కాలేదు. ఆ తర్వాత 2021లో ఆయన దాన్ని 25 మిలియన్ డాలర్లకు విక్రయానికి పెట్టారు. బ్లూంబర్గ్ బిలియనీర్ల ఇండెక్స్ ప్రకారం.. ముకేశ్ అంబానీ సంపద ప్రస్తుతం 97.9 బిలియన్ డాలర్లు (సుమారు రూ.8.2 లక్షల కోట్లు). దీంతో ఆయన దేశంలోనే అత్యంత సంపన్నమైన వ్యక్తిగా అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా 18వ స్థానంలో నిలిచారు. తరువాత స్థానంలో ఆదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ ఆదానీ ఉండగా.. ఆయన నికర ఆస్తులు 82.1 బిలియన్ డాలర్లని ఆ ఇండెక్స్ తెలిపింది.

# త్వరలో బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐలు: నిర్మలా సీతారామన్



త్వరలో బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐలను ప్రతిపాదించే బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. బీమా రంగంలోకి మరిన్ని సంస్థలను తీసుకురావడంతో పాటు.. అధిక సంఖ్యలో ఉద్యోగాల సృష్టికి ఇది ఉపయోగపడుతుందన్నారు. ఈ ఎఫ్‌డీఐ ప్రతిపాదిత బిల్లును రాబోయే శీతాకాల సమావేశాల్లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉందన్నారు. ఇందులో భాగంగా బీమా చట్టం 1938లోని వివిధ నిబంధనలను సవరించాలని ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. వాటిలో బీమా రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడు(ఎఫ్‌డీఐ)లను ప్రస్తుత 74 శాతం నుంచి 100 శాతానికి చేర్చడంతో పాటు పెయిడప్ క్యాపిటల్‌ను తగ్గించడం, కాంపొజిట్ లైసెన్స్ నిబంధన వంటివి ఈ బిల్లులో ఉన్నాయన్నారు. బీమా నియంత్రణ అభివృద్ధి చట్టం 1999లోనూ సవరణలు ప్రతిపాదించినట్లు తెలిపారు.పాలసీదారుల ప్రయోజనాలను ప్రోత్సహించడం, వారి ఆర్థిక భద్రతను పెంచడం, బీమా మార్కెట్‌లోకి మరిన్ని భాగస్వామ్య సంస్థల ప్రవేశాన్ని సులభతరం చేయడం, ఆర్థిక వృద్ధి, ఉపాధి కల్పనకు ప్రతిపాదిత సవరణలు ఉపయోగపడతాయని నిర్మలా సీతారామన్ అన్నారు. మోదీ ప్రభుత్వం తాజాగా తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలు భారత్‌లోని ప్రతి పౌరుడు సాధించిన విజయమని పేర్కొన్నారు. దీపావళి పండగకు ముందే జీఎస్టీ సంస్కరణలను ప్రారంభించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచన మేరకు ఈ సంస్కరణలను ప్రజలముందుకు తీసుకువచ్చి అనేక కుటుంబాలపై భారం తగ్గించామన్నారు. ప్రజల సాధికారత ద్వారానే భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# సరిగ్గా ఆకలిగా వేయట్లేదా? ఆ వ్యాధికి సంకేతం కావచ్చు

సరిగ్గా ఆకలి వేయకపోవడం, కొద్ది తిన్నా కడుపు నిండినట్లు అనిపించడం వంటి సమస్యలను ఈ మధ్యా చాలా మంది ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య వెనుక అనేక కారణాలు ఉన్నప్పటికీ, విటమిన్ బి1 (థియామిన్) లోపం ప్రధాన కారణాలలో ఒకటి అని ఆరోగ్య నిపుణులు, యుఎస్ నేషనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ ఇన్ఫర్మేషన్ నివేదికలు చెబుతున్నాయి. శరీరంలో జీవక్రియ సరిగ్గా జరగడానికి విటమిన్ బి1 చాలా అవసరం. మనం తినే ఆహారాన్ని శక్తిగా మార్చడంలో ఇది ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. శరీరంలో ఈ విటమిన్ స్థాయి తగ్గినప్పుడు, జీవక్రియ మందగిస్తుంది. దీనివల్ల ఆకలి లేకపోవడం, అలసట, బలహీనత వంటి సమస్యలు వస్తాయి. అలాగే విటమిన్ బి1 లోపం ఆకలిని తగ్గించడమే కాకుండా, శరీరంలోని నాడీ వ్యవస్థ, జీర్ణవ్యవస్థ, కండరాల పనితీరును కూడా ప్రభావితం చేస్తుంది. ఇది మానసిక గందరగోళం, చిరాకు మరియు ఏకాగ్రత లేకపోవడం వంటి సమస్యలకు దారితీస్తుంది. ఈ సమస్య ఎక్కువగా వృద్ధులలో కనిపిస్తున్నప్పటికీ, యువతలో కూడా దీని ప్రభావం పెరుగుతోంది. విటమిన్ బి1 లోపాన్ని అధిగమించడానికి సరైన ఆహారాన్ని తినడం చాలా ముఖ్యం. దీని కోసం, మీ రోజువారీ ఆహారంలో ఈ క్రింది పదార్థాలను చేర్చండి. తృణధాన్యాలు, చిక్కుళ్ళు: ఇవి విటమిన్ దీ1 యొక్క మంచి వనరులు. ఆకుకూరలు: పాలకూర, బ్రోకలీ వంటి ఆకుకూరల్లో థయామిన్ పుష్కలంగా ఉంటుంది వీటిని ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఈ లోపాన్ని దూరం చేయవచ్చు గింజలు, ఎండిన పండ్లు: విటమిన్ బి1 వాల్‌నట్స్, వేరుశెనగలు, పొద్దుతిరుగుడు విత్తనాలలో లభిస్తుంది. మాంసాహారం: ఈ విటమిన్ లోపాన్ని చేపలు, చికెన్ వంటి మాంసాహార ఆహారం ద్వారా కూడా భర్తీ చేయవచ్చు. గమనిక: ఈ సమస్య డైట్ పాటించడం ద్వారా తగ్గకపోతే, మీరు వైద్యుడిని సంప్రదించి సప్లిమెంట్లు తీసుకోవచ్చు. అయితే, వైద్యుడిని సంప్రదించకుండా మీరు మీరే ఎటువంటి సప్లిమెంట్లను తీసుకోకూడదు. సరైన జీవనశైలి, ఒత్తిడిని తగ్గించడం, తగినంత నిద్రపోవడం కూడా ఆకలిని పెంచడానికి సహాయపడుతుంది. మీకు ఈ సమస్యలు చాలా కాలంగా ఉంటే, నిపుణుడిని సంప్రదించడం మంచిది.





# వంకాయతో ఈ సమస్యలకు చెక్ !

వంకాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో ఉండే ఫ్రీరాడికల్స్ ను నశింపజేసి క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా కాపాడడంలో సహాయపడతాయి. వంకాయలో పిండి పదార్థాలు, ఫైబర్ సమృద్ధిగా ఉంటాయి. వంకాయలోని పొటాషియం శరీరంలోని హైడ్రైట్లను తొలగించి గుండె సమస్యలను నివారిస్తుంది. వంకాయ శరీరంలో కొవ్వులను కరిగిస్తుంది. వంకాయ ఆరోగ్యానికి చాలా మంచిది. విటమిన్లు, ఖనిజాలతో నిండి ఉంది. పలు రకాల ఆరోగ్య సమస్యలు రాకుండా చెక్ పెట్టొచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. వంకాయ తినటం వల్ల గుండె సమస్యలకు అడ్డుకట్ట వేయవచ్చు. ఇది కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లను తగ్గిస్తుంది. గుండె జబ్బులకు ప్రధాన కారణమయ్యేవాటి నుంచి కాపాడుతుంది. వంకాయలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. వంకాయ తీసుకోవటం వల్ల గ్లూకోజ్ శోషణను నెమ్మదిస్తుంది. రక్తంలో చక్కెర అకస్మాత్తుగా పెరగదు. మధుమేహ వ్యాధిగ్రస్తులు తమ ఆహారంలో వంకాయను చేర్చుకుంటే మంచి ఫలితాలు పొందొచ్చు. వంకాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో ఉండే ఫ్రీరాడికల్స్ ను నశింపజేసి క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా కాపాడడంలో సహాయపడతాయి. వంకాయలో పిండి పదార్థాలు, ఫైబర్ సమృద్ధిగా ఉంటాయి. వంకాయలోని పొటాషియం శరీరంలోని హైడ్రైట్లను తొలగించి గుండె సమస్యలను నివారిస్తుంది. వంకాయ శరీరంలో కొవ్వులను కరిగిస్తుంది. వంకాయలోని ఫోలేట్, పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ బీ3, బీ6, బీటా కేరోటిన్, యాంటీఆక్సిడెంట్లు తదితర పోషకాలు గుండెపోటు ముప్పును తగ్గిస్తాయి. రక్త ప్రవాహాన్ని మెరుగుపరుస్తాయి. వంకాయ తినడం బరువు తగ్గడానికి చాలా మంచిది. ఇది కొవ్వు బర్నింగ్ రేటును మరింత పెంచుతుంది. టైప్2 మధుమేహం రోగుల రక్తంలోని చక్కెర్ల (గ్లోకోజ్) స్థాయిని తగ్గించడంలో వంకాయ బాగా పనిచేస్తుంది. రక్త ప్రవాహాన్ని మెరుగుపరుస్తుంది.


# తాటి మిఠాయి ఆరోగ్య ప్రయోజనాలు




ఆసియా, ఆఫ్రికా, అమెరికాలోని కొన్ని ప్రాంతాలలో ఉపయోగించే తాటి బెల్లం ప్రధానంగా అనేక ఆహార పదార్థాలలో ఉపయోగించబడుతుంది. ఒకప్పుడు అందరి వంటగదిలో బెల్లం దొరికేది. అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన ఈ బెల్లం నేటికీ దాని డిమాండ్ తగ్గలేదు. కానీ నేటి తరానికి దాని గురించి తెలియదు. తాటి బెల్లం అద్భుతమైన రుచిని కలిగి ఉంటుంది. తాటి బెల్లం తయారీ ప్రక్రియలో ఎటువంటి రసాయనాలను ఉపయోగించరు. కాబట్టి, ఇది సహజ చక్కెర. ఇందులో చక్కెర కంటే తక్కువ చక్కెర ఉంటుంది. తాటి బెల్లం ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. బెల్లం రక్తహీనతకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని చాలా మందికి తెలియదు. బెల్లంలో ఉండే ఐరన్ కంటెంట్ రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిని నిర్వహించడానికి సహాయపడుతుంది. కంటి చూపు మెరుగుపడటానికి బెల్లం పాలలో కలిపి తినండి. కాల్షియం, పొటాషియం పుష్కలంగా ఉండే తాటి బెల్లం పాలు ఎముకలు, దంతాలను బలోపేతం చేస్తుంది. బెల్లం తినడం వల్ల కలిగే మరో ముఖ్యమైన ప్రయోజనం ఏమిటంటే జీర్ణ రుగ్మతల నుండి ఉపశమనం కలిగించే సామర్థ్యం దీనికుంది. ఇది జీర్ణ ఎంజైమ్‌లను సక్రియం చేయడమే కాకుండా ప్రేగు కదలికలను నియంత్రిస్తుంది. మలబద్ధకం, అజీర్ణం నుండి ఉపశమనం కలిగిస్తుంది. చాలా మంది పిల్లలు నోటి పూతలతో బాధపడుతున్నారు. గాయం మీద ఏలకులు, బెల్లం పొడి పూయడం వల్ల నొప్పి నుండి ఉపశమనం లభిస్తుంది. నోటి పూతలు కూడా తగ్గుతాయి. గతంలో, జలుబు ఉన్న పిల్లలకు మందు ఇవ్వడానికి బదులుగా, వారు వారికి బెల్లం తినిపించేవారు. ఇది జలుబు నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఇది శ్లేష్మాన్ని మృదువుగా చేస్తుంది. పేరుకుపోయిన శ్లేష్మాన్ని తొలగిస్తుంది. నల్ల మిరియాలు, నెయ్యితో బెల్లం కలిపి తాగడం వల్ల గొంతు నొప్పి తగ్గుతుంది. తాటి బెల్లం తరచూ తినడం వల్ల ఇది కాలేయాన్ని శుభ్రపరుస్తుంది. మీ శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపుతుంది. రక్తాన్ని శుభ్రపరుస్తుంది. శరీరానికి అవసరమైన రోగనిరోధక శక్తిని పెంచుతుంది. తాటి బెల్లం మీ పొట్టను శుభ్రపరుస్తుంది. పేగులు బాగా పనిచేయడానికి సహాయపడుతుంది.

# అదే పనిగా ఆవలింతలు వస్తున్నాయా..?

ఆవలింత అనేది సాధారణంగా అందరికీ ఉంటుంది..కానీ, ఇది ఎప్పుడు, ఎందుకు వస్తుందోనని మీరెప్పుడైనా ఆలోచించారా? సాధారణంగా ఎవరైనా ఆవలిస్తే అది నిద్రకు సంకేతంగా భావిస్తారు. మీ పక్కన ఉన్నవారు ఆవలించినా మీకు ఆవలింతలు వస్తాయి. అలాగే, కొంతమందికి తరచుగా ఆవలింతలు వస్తుంటాయి. అలసట ఎక్కువగా ఉండటం వల్ల ఆవలింతలు వస్తాయి. తగినంత విశ్రాంతి లేకపోవడం, బాగా అలసిపోవడం కారణంగా నిరంతరం ఆవలింతలు వస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.. నిద్రలేమి కూడా ఆవలింతలు రావడానికి కారణం. మీకు నిరంతరం ఆవలింతలు వస్తున్నాయంటే మీ శరీరం మరింత విశ్రాంతి కోరుకుంటుందని అర్థం. స్లీప్ ఆప్నియా, నార్కొలెప్సీ వంటి నిద్ర సమస్యల వల్ల సరిగా నిద్రపట్టదు. దీని వల్ల ఆవలింతల ఎక్కువగా వస్తాయి. ఆందోళన, డిప్రెషన్ వంటి మానసిక సమస్యల వల్ల కూడా ఆవలింతలు ఎక్కువగా వస్తాయని నిపుణులు అంటున్నారు.. కాబట్టి ఆందోళన, కుంగుబాటుతనం తగ్గించుకోవాలని సూచిస్తున్నారు. ఒత్తిడి వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి. ఒత్తిడి అధికంగా ఉన్నప్పుడు ఆవలింతలు ఎక్కువగా వస్తాయి. అంతేకాదు..నాడీ సంబంధిత సమస్యల వల్ల కూడా ఆవలింతలు ఎక్కువగా వస్తాయని నిపుణులు చెబుతున్నారు.. మీకు అదే పనిగా ఆవలింతలు వస్తే నాడీ వ్యవస్థను కాపాడుకోవాలని సూచిస్తున్నారు. ఎక్కువగా వచ్చే ఆవలింతలు గుండె సమస్యలకు సంకేతంగా ఉంటాయి. ఛాతీ నొప్పితో పాటు ఆవలింతలు ఉంటే వైద్యుడ్ని కలవండి. రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గడం వల్ల కూడా ఆవలింతలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి రక్తంలో సరైన చక్కెర స్థాయిలను మెయింటేన్ చేయండి. అలాగే, సరిపడా నీరు తాగకపోవడం వల్ల కూడా ఆవలింతలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు.. డీహైడ్రేషన్ వల్ల అదేపనిగా ఆవలింతలు వస్తాయని అంటున్నారు.. ఇలాంటప్పుడు ఎక్కువగా నీరు తాగాలని సూచిస్తున్నారు.






# అకస్మాత్తుగా తల తిరుగుతుంటే ఆ వ్యాధులు వెంటాడుతున్నట్లే..

అకస్మాత్తుగా తల తిరగడం ఒక సాధారణ సమస్యలా అనిపించవచ్చు.. కానీ కొన్నిసార్లు దీని వెనుక తీవ్రమైన కారణాలు ఉండవచ్చు. ఈ సమస్య పదే పదే వస్తుంటే, దానిని విస్మరించకూడదు.. సకాలంలో దాని పై దృష్టి పెట్టి.. వైద్య నిపుణులను సంప్రదించాలి. చాలా మందికి అకస్మాత్తుగా తలతిరుగుడు సమస్య ఉంటుంది. లేచి నిలబడిన సమయంలో.. నడుస్తున్నప్పుడు లేదా మీరు అకస్మాత్తుగా తల తిప్పినప్పుడు ఈ సమస్య అనిపించవచ్చు.. తల తిరుగుతున్నట్లుగా లేదా సమతుల్యత కోల్పోవడం లాగా అనిపిస్తుంది. అలసట, నిర్జలీకరణం, తక్కువ రక్తపోటు, రక్తహీనత లేదా చెవి లోపలి సమస్యలు వంటి అనేక కారణాలు దీనికి ఉండవచ్చు. కొన్నిసార్లు నిద్ర లేకపోవడం ఒత్తిడి కూడా తలతిరుగుడుకు కారణమవుతాయి. సాధారణంగా ఈ పరిస్థితి కొద్దిసేపు ఉంటుంది. విశ్రాంతి తర్వాత నయమవుతుంది. కానీ ఇది పదేపదే జరిగితే లేదా ఎక్కువ కాలం కొనసాగితే, దానిని విస్మరించకూడదు. కొన్నిసార్లు ఈ లక్షణం తీవ్రమైన వ్యాధికి సంకేతం కావచ్చు. తలతిరగడంతో పాటు, శరీరంలో ఆకస్మిక బలహీనత, దృష్టి మసకబారడం, చెవుల్లో రింగింగ్ శబ్దం, వాంతులు లేదా వికారం వంటి అనేక ఇతర లక్షణాలు కూడా కనిపిస్తాయి. కొంతమంది నడుస్తున్నప్పుడు సమతుల్యతను కోల్పోతారు.. అంతేకాకుండా.. మళ్లీ మళ్లీ పడిపోతామని భయపడతారు. తలతిరగడం ఛాతీ నొప్పి, శ్వాస ఆడకపోవడం, చేతులు, కాళ్ళు తిమ్మిరి లేదా మాట్లాడటంలో ఇబ్బంది వంటి లక్షణాలతో ఉంటే, పరిస్థితి తీవ్రంగా ఉంటుంది. అటువంటి పరిస్థితిలో, వెంటనే వైద్యుడిని సంప్రదించడం అవసరం. మాక్స్ సాకేత్‌లోని న్యూరాలజీ విభాగం యూనిట్ హెడ్ డాక్టర్ దల్జీత్ సింగ్ వివరిస్తూ..



ఆకస్మిక తలతిరుగుడు అనేక వ్యాధుల లక్షణం కావచ్చు. అత్యంత సాధారణ కారణం తక్కువ రక్తపోటు నిర్జలీకరణం.. దీనిలో శరీరంలో నీరు ఉప్పు లేకపోవడం ఉంటుంది. రక్తం లేకపోవడం (రక్తహీనత) కూడా తలతిరుగుదలకు ప్రధాన కారణం.. ఎందుకంటే ఇందులో సరైన మొత్తంలో ఆక్సిజన్ మెదడుకు చేరదు. దీనితో పాటు, తల తిరుగుడుకు అత్యంత సాధారణ కారణం లోపలి చెవి సమస్య.. అంటే వెర్టిగో.. దీనిలో చెవి సమతుల్యత చెదిరిపోతుంది. తీవ్రమైన వ్యాధుల గురించి మాట్లాడుకుంటే.. మెదడు స్ట్రోక్, గుండె జబ్బులు చక్కెర స్థాయి అకస్మాత్తుగా పడిపోవడం కూడా తలతిరుగుడుకు కారణం కావచ్చు. కొన్నిసార్లు పార్కిన్సన్స్ లేదా మల్టిపుల్ స్క్లెరోసిస్ వంటి నాడీ సంబంధిత వ్యాధులలో కూడా తలతిరుగుడు కొనసాగుతుంది. వృద్ధులలో, బలహీనమైన రోగనిరోధక శక్తి ఉన్నవారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. అందువల్ల, తలతిరుగుడు తరచుగా సంభవిస్తే, ఎక్కువ కాలం పాటు ఉంటే లేదా ఇతర తీవ్రమైన లక్షణాలతో పాటు ఉంటే, దానిని తేలికగా తీసుకోకండి.. వెంటనే తనిఖీ చేసుకోండి.

# రోజుని టీతో మొదలు పెట్టడం అలవాటా!



చాలా మందికి రోజుని టీ తాగడంతోనే మొదలు పెట్టడం అలవాటు. మంచం మీదనే బెడ్ టీ తాగి తమ పనులు మొదలు పెడతారు. అయితే ఇలా ఖాళీ కడుపుతో టీ తాగడం వల్ల ఆరోగ్యానికి హానికరం అని మీకు తెలుసా? ఖాళీ కడుపుతో టీ తాగడం వల్ల కడుపులో ఆమ్లత్వం పెరుగుతుందని, దీనివల్ల గుండెల్లో మంట, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలు వస్తాయని అనేక అధ్యయనాలు నిరూపించాయి. చాలా మందికి టీ తాగడం అలవాటు. ఉదయం నిద్ర లేవగానే అల్పాహారం తీసుకోకుండా ఒక కప్పు వేడి టీ తాగి రోజుని ప్రారంభిస్తారు. అయితే ఖాళీ కడుపుతో టీ తాగడం ఆరోగ్యానికి హానికరం. ఖాళీ కడుపుతో టీ తాగడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు కలుగుతాయని అనేక అధ్యయనాలు వెల్లడిరచాయి. అంతేకాదు ఈ అలవాటు శరీరంలోని ముఖ్యమైన పోషకాలను గ్రహించడాన్ని కూడా అడ్డుకుంటుంది. ఇది అనేక ప్రతికూల ప్రభావాలను కలిగిస్తుంది. టీలో ఉండే కెఫిన్ ప్రభావం నేరుగా రక్తంలోకి వెళ్లి అలసట, ఒత్తిడి, చిరాకును పెంచుతుంది. అందుకనే శరీరంపై ప్రతికూల ప్రభావం చూపకుండా ఉండటానికి టీ తాగే ముందు తేలికపాటి అల్పాహారం తీసుకోవాలని వైద్యులు, ఆరోగ్య నిపుణులు నిరంతరం హెచ్చరిస్తున్నారు. ఉదయం ఖాళీ కడుపుతో ఏమి తిన్నా, తాగినా అది ఆరోగ్యం పై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుందని పోషకాహార నిపుణులు అంటున్నారు., అందుకే ప్రజలు మొదట నిమ్మరసం, ఉసిరి రసం వంటి పోషకాలను తీసుకుంటారు. అయితే చాలా మంది ఖాళీ కడుపుతో టీ తాగుతారు. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. టీలో ఉండే కెఫిన్, టానిన్ వంటి అంశాలు కడుపులో ఆమ్లాన్ని పెంచుతాయి. దీని కారణంగా రోజంతా కడుపులో బరువు లేదా గ్యాస్ సమస్య కలగవచ్చు. కడుపు ఖాళీగా ఉన్నప్పుడు టీ నేరుగా కడుపు లోపలికి వెళ్లి కడుపులోని పొరను ప్రభావితం చేస్తుంది. ఇది చికాకు, గ్యాస్, అల్సర్ వంటి సమస్యలను కలిగిస్తుంది. ఎవరైనా ఖాళీ కడుపుతో టీ తాగితే టీలో ఉండే టానిన్, కెఫిన్ కడుపులోని ఆమ్లాన్ని పెంచుతాయి. సాధారణంగా కడుపులో కొద్ది మొత్తంలో ఆమ్లం ఆహారాన్ని జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. అయితే ఖాళీ కడుపుతో ఆమ్లం ఎక్కువ మొత్తంలో చేరుకోవడం ప్రారంభ మవుతుంది. ఇది కడుపు లోపలి పొరలో చికాకు కలిగిస్తుంది. ఇది చాలా కాలం పాటు జరిగితే కడుపు గోడ బలహీనపడి అల్సర్ వంటి వ్యాధులకు కారణమవుతుంది. ఉదయం ఖాళీ కడుపుతో టీ తాగే అలవాటు ఉన్నవారికి అసిడిటీ, గ్యాస్ట్రిటిస్ వంటి సమస్యలు ఎక్కువగా ఉంటాయని పరిశోధనలు చెబుతున్నాయి. అందుకనే కడుపులో ఏర్పడే ఆమ్ల ప్రభావం తగ్గడానికి టీ తాగే ముందు తేలికపాటి అల్పాహారం తీసుకోవాలని వైద్యులు సిఫార్సు చేస్తున్నారు. ఖాళీ కడుపుతో టీ తాగడం వల్ల జీర్ణవ్యవస్థపై కూడా చెడు ప్రభావం చూపుతుంది. కడుపు ఖాళీగా ఉన్నప్పుడు టీలో ఉండే కెఫిన్ నేరుగా కడుపు గోడ ద్వారా గ్రహించబడుతుంది. తక్షణ ప్రభావాన్ని చూపుతుంది. ఇది కడుపు తిమ్మిరి, మంట వంటి సమస్యలను కలిగిస్తుంది. ఇది ఆహారాన్ని జీర్ణం చేసే గ్రంథుల సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. ఖాళీ కడుపుతో టీ తాగడం వల్ల జీర్ణ రసాల సమతుల్యత దెబ్బతింటుందని పరిశోధనలు చెబుతున్నాయి. ఫలితంగా ఆహారం జీర్ణం కావడానికి సమయం పడుతుంది. పోషకాలు సరిగ్గా గ్రహించబడవు.

TELANGANA MUCHATLU
తెలంగాణ ముచ్చట్లు
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# భారత్ ఘన విజయం



పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా 'మ్యాచ్ బాయ్‌కాట్' నేపథ్యంలో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్‌దే పైచేయి అయ్యింది. ఆదివారం వార్‌వన్‌సైడ్ అన్నట్లు సాగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 7 వికెట్ల తేడాతో పాక్‌పై ఘన విజయం సొంతం చేసుకుంది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లో రెండు విజయాలతో భారత్ నాలుగు పాయింట్లతో గ్రూపుఏలో అగ్రస్థానంలో కొనసాగుతున్నది. కుల్దీప్‌యాదవ్(3/18), అక్షర్‌పటేల్ (2/18), బుమ్రా (2/28) ధాటికి పాక్ 20 ఓవర్లలో 127/9 స్కోరుకు కుప్పకూలింది. ఫర్హాన్(40), అఫ్రిదీ(33 నాటౌట్) రాణించారు. లక్ష్యఛేదనలో భారత్ 15.5 ఓవర్లలో 131/3 స్కోరు చేసింది. కెప్టెన్ సూర్యకుమార్(47 నాటౌట్), అభిషేక్‌వర్మ(31), తిలక్‌వర్మ(31) విజయంలో కీలకమయ్యారు. ఈనెల 19న ఒమన్‌తో భారత్ తలపడనుంది.

స్పిన్ ఉచ్చులో పాక్ : టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్థాన్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. హార్దిక్ పాండ్యా వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్ మొదటి బంతికే పాక్ ఓపెనర్ సయిమ్ ఆయూబ్(0) డకౌట్‌గా వెనుదిరిగాడు. హార్దిక్ బంతిని షాట్ ఆడే క్రమంలో పాయింట్‌లో బుమ్రాకు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. ఆరు బంతుల తేడాతో మహమ్మద్ హరిస్(3) బుమ్రా ఖాతాలో చేరాడు. ఆయూబ్‌ను అనుసరిస్తూ డీప్ బ్యాక్‌వర్డ్ స్కేర్‌లో హార్దిక్ పట్టిన క్యాచ్‌తో హరిస్ రెండో వికెట్‌గా ఔట్ కావడంతో పాక్ 6 పరుగులకే రెండు కీలక వికెట్లు కోల్పోయింది. ఈ క్రమంలో ఫర్హాన్(40), ఫకర్ జమాన్(17) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే బాధ్యతను భుజానేసుకున్నారు. వీరిద్దరు మరో వికెట్ పడకుండా జాగ్రత్తపడుతూ అడపాదడపా బౌండరీలు సాధించడంతో పవర్‌ప్లే ముగిసే సరికి పాక్ 2 వికెట్ల నష్టానికి 42 పరుగులు చేసింది. బౌలింగ్ మార్పుగా వచ్చిన అక్షర్‌పటేల్..ఎనిమిదో ఓవర్‌లో జమాన్‌ను ఔట్ చేసి పాక్ వికెట్ల పతనానికి నాంది పలికాడు. భారీ షాట్ ఆడే క్రమంలో లాంగ్‌ఆన్‌లో తిలక్‌వర్మ పట్టిన క్యాచ్‌తో జమాన్ ఔట్ కావడంతో మూడో వికెట్‌కు 39 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఇక్కణ్నుంచి భారత స్పిన్నర్లు పాక్ బ్యాటర్లు లక్ష్యంగా వికెట్ల వేట కొనసాగించారు. ఓవర్ తేడాతో కెప్టెన్ సల్మాన్ అగా(3)ను తన ఖాతాలో వేసుకోవడంతో పాక్ కష్టాలు మరింత రెట్టింపయ్యాయి. ఇదే అదనుగా తమ అమ్ములపొదిలోని కీలక అస్త్రమైన చైనామన్ స్పిన్నర్ కుల్దీప్‌యాదవ్‌ను సూర్యకుమార్ ప్రయోగించడం బాగా కలిసొచ్చింది. కుల్దీప్ 13వ ఓవర్‌లో వరుస బంతుల్లో హసన్ నవాజ్(5), మహమ్మద్ నవాజ్(0) వెంటవెంటనే ఔట్ చేయడంతో పాక్ 65 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. ఓవైపు సహచరులు పెవిలియన్‌కు క్యూ కడుతున్నా..ఫర్హాన్ పరిణతి కనబరిచాడు. మరోమారు బౌలింగ్‌కు వచ్చిన కుల్దీప్..ఈసారి ఫర్హాన్‌ను ఔట్ చేయడంతో పాక్ 100 పరుగుల లోపే కుప్పకూలుతుందనుకున్నారు. ఆఖర్లో అఫ్రిదీ(16 బంతుల్లో 33 నాటౌట్, 4 సిక్స్‌లు) బ్యాటు ఝులిపించడంతో పాక్‌కు గౌరవప్రదమైన స్కోరు దక్కింది. మొత్తంగా స్పిన్నర్లు కుల్దీప్, అక్షర్, వరుణ్..పాక్ నడ్డివిరువడంలో కీలకమయ్యారు.

భారత్ ఆడుతూ పాడుతూ : పాక్ నిర్దేశించిన లక్ష్యాన్ని భారత్ ఆడుతూ పాడుతూ ఛేదించింది. పాక్ స్టార్ బౌలర్ అఫ్రిదీ వేసిన తొలి రెండు బంతులను కండ్లు చెదిరే రీతిలో అభిషేక్‌శర్మ ఫోర్, సిక్స్‌గా మలిచి ఇన్నింగ్స్ ఎలా ఉండబోతుందో చెప్పకనే చెప్పాడు. మరో ఎండ్‌లో అగ్నికి ఆయువు తోడైనట్లు శుభ్‌మన్‌గిల్ వరుసగా రెండు ఫోర్లు కొట్టి జోరు పెంచాడు. అయితే ఆయూబ్ ఊరించే బంతిని ముందుకొచ్చి ఆడే క్రమంలో గిల్(10) స్టంపౌట్ అయ్యాడు. ఓవైపు గిల్ ఔటైనా..అభిషేక్..అఫ్రిదీని బాదడం ఆపలేదు. మళ్లీ ఓ ఫోర్, సిక్స్‌తో గట్టిగా అరుసుకున్నాడు. మరుసటి ఓవర్‌లో ఆయూబ్‌ను వరుసగా రెండు ఫోర్లు బాదిన అభిషేక్..అష్రఫ్‌కు క్యాచ్ ఇచ్చి రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. ఈ క్రమంలో తిలక్‌వర్మ, సూర్యకుమార్ ఇన్నింగ్స్ బాధ్యతను తీసుకోగా, పవర్‌ప్లే పూర్తయ్యే సరికి టీమ్‌ఇండియా 64/2 స్కోరు చేసింది. పాక్‌కు ఏమాత్రం అవకాశమివ్వని ఈ ఇద్దరు బౌండరీలతో లక్ష్యాన్ని కరిగించే ప్రయత్నం చేశారు. సాఫీగా సాగుతున్న సమయంలో ఆయూబ్ బౌలింగ్‌లో తిలక్ ఔట్ కావడంతో మూడో వికెట్‌కు 56 పరుగుల పార్టనర్‌షిప్‌కు బ్రేక్ పడింది. తిలక్ తర్వాత క్రీజులోకి వచ్చిన శివమ్‌దూబే..సూర్యకు జతకలిశాడు. వీరిద్దరు మరో వికెట్ పడకుండా జట్టును గెలుపు తీరాలకు చేర్చారు.

**సంక్షిప్త స్కోర్లు**

పాకిస్థాన్: 20 ఓవర్లలో 127/9 (ఫర్హాన్ 40, అఫ్రిదీ 33 నాటౌట్, కుల్దీప్ 3/18, అక్షర్ 2/18)

భారత్: 15.5 ఓవర్లలో 131/3 (సూర్యకుమార్ 47 నాటౌట్, అభిషేక్ 31, ఆయూబ్ 3/35).

**నో షేక్ హ్యాండ్..**

భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌లో ఒక ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. మ్యాచ్ టాస్ సమయంలో ఇరు జట్ల కెప్టెన్లు సూర్యకుమార్‌యాదవ్, సల్మాన్ ఒకరికొకరు కరచాలనం చేసుకోలేకపోయారు. మామూలుగా టాస్ వేసేటప్పుడు కెప్టెన్లు తమ జట్ల వివరాలను ఒకరికొకరు అందజేసుకుంటూ షేక్ హ్యాండ్‌ఇచ్చుకోవడం ఆనవాయితీ. కానీ పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే.

ఈ నేపథ్యంలో ఇప్పటికే మ్యాచ్ బాయ్‌కాట్ అంటూ తీవ్ర నిరసన వ్యక్తమవుతున్న క్రమంలో సూర్యకుమార్..పాక్ కెప్టెన్ సల్మాన్ వైపు కనీసం కన్నెత్తి కూడా చూడలేదు. ఇద్దరు కెప్టెన్లు తమ జట్టకు సంబంధించిన టీమ్ షీట్లను మ్యాచ్ రిఫరీ అండీ పైక్రాఫ్ట్‌కు అందించి ఎవరి స్థానాల్లో నిలుచున్నారు. రవిశాస్త్రి వ్యాఖ్యాతగా వ్యవహరించాడు.



## టెట్ ఉత్తీర్ణతపై సుప్రీంకోర్టు తీర్పు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

టెట్ ఉత్తీర్ణత పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నుంచి ఇన్ సర్వీస్ టీచర్లకు రక్షణ కల్పించాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ) జాతీయ ప్రధాన కార్యదర్శి చావ రవి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందుకోసం విద్యాహక్కు చట్టం సెక్షన్ 23ను సవరించాలని ఆయన కోరారు. అలాగే, టెట్ సిలబస్, అర్హత ప్రమాణాలను శాస్త్రీయంగా మార్చాలని ఎన్సీటీఈని డిమాండ్ చేశారు. ఈనెల 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం, ఐదేళ్ల కంటే ఎక్కువ సర్వీసు ఉన్న ఇన్ సర్వీస్ టీచర్లందరూ రెండేళ్లలో టెట్ పాస్ కావాలి, లేదంటే ఉద్యోగాన్ని కోల్పోవాల్సి వస్తుంది. ఈ తీర్పు సీనియర్ టీచర్లలో ఆందోళన కలిగిస్తోందని, దీనిని నివారించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేయాలని చావ రవి డిమాండ్ చేశారు. 2010 కి ముందు నియమితులైన టీచర్లకు టెట్ మినహాయింపు ఇచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో, 15 ఏళ్ల తర్వాత హఠాత్తుగా పరీక్ష పాస్ కావాలని చెప్పడం సరికాదన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర కార్యాలయం దోమలగూడలో చావ రవి అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జాతీయ విద్యా విధానాన్ని సవరించాలని, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని, ఆదాయ పన్ను పరిమితిని పెంచాలని, సమగ్ర శిక్షా ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వాలని వంటి పలు డిమాండ్లపై దేశవ్యాప్త ప్రచారంలో భాగస్వాములు కావాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.

**ఇతర డిమాండ్లు..**

ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. వెంకట్ మాట్లాడుతూ, రెండేళ్లలో వీలైనన్ని ఎక్కువ సార్లు టెట్ పరీక్ష నిర్వహించి అందరూ పాస్ అయ్యేలా అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. డిగ్రీ, బీఈడీ అర్హతలతో ఎస్జీటీలుగా నియమితులైన వారికి ఓడీఎల్ పద్ధతిలో డీఈడీ స్వల్పకాలిక శిక్షణ ఇచ్చి, టెట్ పేపర్ 1 రాయడానికి అర్హత కల్పించాలని డిమాండ్ చేశారు. గురుకులాల టైమ్ టేబుల్ మార్చాలని, కేజీబీవీ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కూడా ఆయన కోరారు. సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఇతర రాష్ట్ర కమిటీ సభ్యులు, వివిధ జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. సమావేశం ప్రారంభంలో ఇటీవల మరణించిన సీపీఐ జాతీయ నాయకులు సురవరం సుధాకర్ రెడ్డి, యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జియావుద్దీన్ అహ్మద్‌లకు నివాళులర్పించారు.



## రష్యాతో దోస్తీపై చైనాకు ట్రంప్ హెచ్చరిక.. డ్రాగన్ కౌంటర్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. రష్యా విషయంలో దూకుడు పెంచుతూ నాటో దేశాలు, చైనాలను హెచ్చరించారు. చమురు కొనుగోలును వెంటనే నిలిపేయాలని.. లేదంటే చైనాపై 100 శాతం పన్నులు విధిస్తానని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ట్రంప్ హెచ్చరికలపై చైనా స్పందించింది. అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలపై చైనా విదేశాంగ మంత్రి స్పందించారు. స్లోవేనియా పర్యటనలో ఉన్న చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి మాట్లాడుతూ..'యుద్ధం సమస్యలను పరిష్కరించలేదు. ఇదే సమయంలో పలు దేశాలపై ఆంక్షలు సమస్యలను క్లిష్టతరం చేస్తాయి. ప్రస్తుతం చైనా ఎలాంటి యుద్ధం చేయడం లేదు.. యుద్ధంలో పాల్గొనడం లేదని చెప్పుకొచ్చారు. అయితే, చైనాపై ట్రంప్ టారిఫ్‌ల ప్రకటన చేసిన కొద్దిసేపటికే వాంగ్ యి ఇలా కామెంట్స్ చేయడం గమనార్హం.

అంతకుముందు ట్రంప్.. చైనాపై భారీ సంఖ్యలో సుంకాలు విధిస్తేనే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నిలిచిపోతుందని తాను విశ్వసిస్తున్నట్లు ప్రకటించారు. కొన్ని నాటో దేశాలు ఇప్పటికీ రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుండటం దిగ్భ్రాంతికి గురిచేస్తోందని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. యుద్ధాన్ని నిలువరించేందుకు కావాల్సిన నిబద్ధత కొన్ని నాటో దేశాల్లో 100 శాతం కన్నా ఎంతో తక్కువగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అందుకే పన్నులు విధిస్తేనే యుద్ధం ముగుస్తుందన్నారు. లేదంటే తన సమయంతోపాటు అమెరికా డబ్బునూ వృథా చేస్తున్నట్లేనని అన్నారు.

అంతటితో ఆగకుండా.. రష్యాపై బీజింగ్ పట్టు సాధించిందని.. సుంకాలు విధించడం ద్వారా దీన్ని బలహీనపరచవచ్చని అన్నారు. ఈ యుద్ధానికి బైడెన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీలే కారణమని మరోసారి ఆరోపించారు. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్న దేశాలపై టారిఫ్‌లు విధించాలని ఈయూ, జీ7 దేశాలకు విజ్ఞప్తి చేసిన మరుసటి రోజే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం.

## ముహూర్తం కోసం ఎదురు చూడకండి!!

- కృషే నిజమైన శుభసమయం
- ముహూర్తాలు లేకుండానే పుట్టుక,మరణం

హన్మకొండ,సెప్టెంబర్14(తెలంగాణ ముచ్చట్లు):



> **యువతలో వాయిదా వ్యాధి**
>
> ఈ రోజుల్లో యువతలో పెద్ద సమస్య – ఆలస్యం చేయడం. "రేపటినుంచి చదువుతాను", "వచ్చే నెల జిమ్‌కి వెళ్దాం", "మంచి రోజు కోసం ఆగుదాం" అంటూ వాయిదా వేస్తారు. ఇలా వాయిదా వేసిన ప్రతీ రోజు, విజయానికి దూరం చేస్తుంది.

పుట్టుక, మరణం ముహూర్తాలతో రావు. మనిషి ఈ లోకానికి వచ్చే సమయం ఎవరూ పంచాంగం చూసుకోరు. వెళ్ళిపోయే క్షణాన్ని ఎవరూ గణన చేయలేరు. అయితే జీవితం మధ్యలో ఎందుకు ప్రతిదానికీ ముహూర్తం కావాలి?

ఇది సమాజం ఆలోచించాల్సిన ప్రశ్న.

**ముహూర్తం అనే సంకెళ్లు**

సంప్రదాయాలు, సంస్కృతి మన జీవనంలో భాగమే. కానీ వాటి పేరుతో అడుగులు ఆగిపోవడం సరైంది కాదు. ఉద్యోగం కోసం, చదువు కోసం, వ్యాయామం కోసం, చిన్న చిన్న నిర్ణయాల కోసం కూడా ముహూర్తం ఎదురు చూడడం అనవసరం.సమయం ఎవరి కోసం ఆగదు. అవకాశాలు ఎవరి కోసం వేచి ఉండవు.

**విజయాన్ని ముహూర్తం తేల్చదు**

జీవిత విజయాలు పంచాంగం ఆధారంగా రావు. శ్రమ, పట్టుదల, ఆత్మవిశ్వాసం - ఇవే ఫలితాలను ఇస్తాయి.ఎడిసన్ వెయ్యిసార్లు విఫలమైనా దీపం వెలిగించాడు. రైట్ బ్రదర్స్ మానవుడు ఆకాశంలో ఎగరగలడని నిరూపించారు. అబ్దుల్ కలాం సాధారణ కుటుంబంలో పుట్టి "మిసైల్ మాన్" అయ్యారు. వీరిని విజయవంతులను చేసింది ముహూర్తం కాదు, వారి కష్టం.

**నిజమైన ముహూర్తం నువ్వే**

లేచి చేసే ప్రయత్నమే శుభం.
మొదటి అడుగు శుభం.
ఓటమి తర్వాత మళ్లీ లేచే ధైర్యమే శుభం.
జీవితాన్ని మార్చేది పంచాంగం కాదు - నీ పట్టుదల, నీ కష్టం, నీ ఆత్మవిశ్వాసం.

**సమాజానికి కావలసిన మార్పు**

సంప్రదాయాలను గౌరవించడం తప్పు కాదు. కానీ వాటి పేరుతో సమయాన్ని వృథా చేయడం మాత్రం తప్పు. శుభముహూర్తం కోసం ఆగే ప్రతి క్షణం వృథా. అదే సమయాన్ని నేర్చుకోవడానికి, ముందుకు సాగడానికి ఉపయోగిస్తే భవిష్యత్తు వెలుగుతుంది.
ఒక తరం సమయాన్ని సరిగ్గా ఉపయోగిస్తే, వచ్చే తరాల భవిష్యత్తు మారుతుంది.

**యువతకు పిలుపు**

జననం - ముహూర్తం లేదు.
మరణం - ముహూర్తం లేదు.
అయితే మధ్యలో ఎందుకు అంతా ముహూర్తమే?నీ కష్టం, నీ పట్టుదల, నీ ధైర్యమే నీ శుభముహూర్తం. దాన్ని వృథా చేయకు. ప్రతి క్షణాన్ని పట్టుకొని ముందుకు సాగు.
సమయం దేవుని వరం - దాన్ని సద్వినియోగం చేసుకోవడమే నిజమైన ముహూర్తం.



హన్మకొండ శ్రీకాంత్ జర్నలిస్ట్
M.Com.,MBA.,(Phd)
టీ ఎం జె ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ఇక జాతరే

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నుంచి ఇపుడు రాబోతున్న అవైటెడ్ సినిమాలు ఉన్నాయి. అవే ఉస్తాద్ భగత్ సింగ్ అలాగే ఓజి. రెండూ తన ఫ్యాన్ దర్శకులే తెరకెక్కిస్తుండగా వాటిపై సాలిడ్ హైప్ ఉంది. మరి ఈ సినిమాలు రెండు లేటెస్ట్ గా పూర్తయ్యాయి. అయితే ఒకటి ఓజి పవన్ తన డబ్బింగ్ మొత్తాన్ని లేటెస్ట్ గానే కంప్లీట్ చేసినట్టు మేకర్స్ సాలిడ్ అప్డేట్ ఇస్తే.. ఉస్తాద్ భగత్ సింగ్ మేకర్స్ కూడా నేడే ఇంకో అప్డేట్ గా పవన్ షూటింగ్ మొత్తం కంప్లీట్ చేసినట్టుగా ఒక పవర్ఫుల్ సెండాఫ్ ని ప్రెజెంట్ చేసి వీడియో వదిలారు. ఇలా పవన్ అభిమానులు డబుల్ బ్లాస్ట్ ట్రీట్ లతో ఎంజాయ్ చేస్తున్నారు. ఇక ఓజి సినిమాని మేకర్స్ ఈ సెప్టెంబర్ 25న మేకర్స్ రిలీజ్ చేస్తుండగా మైత్రి మూవీ మేకర్స్ వారు ఉస్తాద్ ని వచ్చే ఏడాది దింపేందుకు ప్లాన్ చేస్తున్నారు.



# ‘ఓజీ’లో సర్ప్రైజ్‌లా..

‘డీజే టిల్లు’ చిత్రంతో తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించిన నటి నేహా శెట్టి. ఇప్పుడామె పవన్ కల్యాణ్ ‘ఓజీ’ సినిమాలో ఓ సర్ప్రైజ్‌లా కనువిందు చేయనున్నట్లు స్పష్టత ఇచ్చింది. సుజీత్ తెరకెక్కిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ప్రియాంక మోహన్ కథానాయిక. ఇమ్రాన్ హష్మీ ప్రతినాయకుడిగా నటించారు. నేహా ఇందులో పవన్‌తో ప్రత్యేక గీతంలో ఆడిపాడటమే కాక ఆయనతో కొన్ని కీలక సన్నివేశాల్లో పాలు పంచుకున్నట్లు తెలిసింది. ఆమె చేసిన ఆ పాటతో పాటు ఈ చిత్ర ట్రైలర్ ఈ వారంలోనే విడుదల కానున్నాయి. ఇక ఈ చిత్రం కోసం పవన్ తన పాత్రకు డబ్బింగ్ చెప్పడం ప్రారంభించినట్లు చిత్ర వర్గాలు సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించాయి. ఈ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఈ నెల 25న థియేటర్లలోకి రానుంది. నేహా ప్రస్తుతం తెలుగులో ఓ కొత్త చిత్రానికి సంతకం చేసింది. దాన్ని నవంబరులో ప్రకటించనున్నట్లు ఆమె తెలిపింది.

# హీరో పాత్రకు మోటివ్ గా మోహన్ బాబు పాత్ర



న్యాచురల్ స్టార్ నాని కెరీర్‌లో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచిన ‘దసరా’ చిత్రాన్ని శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించారు. ఈ సినిమాతో శ్రీకాంత్ ఓదెల ఓవర్ నైట్ లో మోస్ట్ వాంటెడ్ డైరెక్టర్ గా మారిపోయాడు. ఇక ప్రస్తుతం నానితో ‘ది ప్యారడైజ్’ అనే మూవీని తెరకెక్కిస్తున్నాడు. ఐతే, ఈ చిత్రంలో విలన్ పాత్ర కోసం కలెక్షన్ కింగ్ మోహన్ బాబు ఎంపికైనట్టు వార్తలు వచ్చాయి. ఇదే విషయాన్ని మంచు లక్ష్మీ ఖరారు చేసింది. దీంతో, ప్యారడైజ్ లో మోహన్ బాబు విలన్ అంటూ ఓ వార్త వైరల్ గా మారింది.

కానీ, ఈ సినిమాలో మోహన్ బాబు విలన్ గా నటించడం లేదు అని, ఆయన గురువు పాత్రలో కనిపించబోతున్నాడని.. హీరో పాత్రకు మోటివ్ గా మోహన్ బాబు పాత్ర ఉండబోతుందని తెలుస్తోంది. అన్నట్టు ఈ సినిమాలో నాని ‘జడల్’ అనే పాత్రలో కనిపించనున్నాడు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఫస్ట్ లుక్స్ రిలీజ్ అయ్యాయి. పైగా నాని ఇప్పటివరకు కనిపించని విభిన్న లుక్‌లో దర్శనమిచ్చాడు. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ హైదరాబాద్ శివారులో జరుగుతోంది. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ మ్యూజిక్ అందిస్తున్నారు.

# ‘మిరాయ్’ సంగీత దర్శకుడు ఎమోషనల్ వీడియో!

ప్రస్తుతం మన తెలుగు సినిమా దగ్గర ఆయా చిత్రాల తాలూకా సంగీతం పాటలు ఏ రీతిలో ప్రభావాన్ని చూపిస్తున్నాయి అనేది ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అయితే ఈ సంగీతంలో కూడా వినూత్నత మరియు ఇతిహాస అంశాలపై ఇస్తున్న గీతాలకి కూడా మంచి రెస్పాన్స్ వస్తుంది. అయితే ఇటీవల కాలంలో ఇలాంటి సంగీత గీతాలతో అలరించిన సంగీత దర్శకుల్లో గౌర హరి కూడా ఒకరు. సంచలన విజయ చిత్రం హను మాన్ కి తాను ఇచ్చిన సంగీతం పెద్ద ప్లస్ అయ్యింది. దీనితో తన తర్వాత చిత్రం మిరాయ్ కి కూడా అంతకు మించిన స్కోర్ ని తాను ఇచ్చినట్టు ట్రైలర్, టీజర్ చూస్తే అర్థం అయ్యింది. ఇక థియేటర్స్ లో సినిమా విడుదల అయ్యాక మాత్రం గౌర హరి పనితనంకి మార్కులు గట్టిగా వచ్చాయి. మరి ఈ రెస్పాన్స్ తో గౌర హరి చాలా ఎమోషనల్ అయ్యిపోయి ఓ వీడియో వదిలారు. తనకి ఈ అవకాశం ఇచ్చిన కార్తీక్ ఘట్టమనేనికి జీవితాంతం ఋణపడి ఉంటానని తెలిపారు. తాను ఎన్నో ఏళ్ళు సినిమా కోసం కష్టపడ్డారు అని తాను చూపించిన విజువల్స్ బట్టే నా సంగీతం ఇంత గొప్పగా వచ్చింది అని తెలిపారు. అలాగే తేజ సజ్జ కి కూడా ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపాడు. హను మాన్ హిట్ తర్వాత మిరాయ్ కి తాను కరెక్ట్ అని నమ్మి పరిచయం చేసింది తేజ సజ్జ అని తాను తెలిపారు. అలాగే ఈ సినిమా నిర్మాతకి కూడా ధన్యవాదాలు తెలిపి ఈ వీడియోలో చాలా ఎమోషనల్ అయ్యారు. చివరిగా మిరాయ్ ని ఇంతలా ఆదరిస్తున్న తెలుగు ఆడియెన్స్ కి ధన్యవాదాలు తెలిపి ముగించారు. దీనితో తన వీడియో వైరల్ గా మారింది.







# క్లాసికల్ డ్యాన్సర్‌గా శ్రద్ధ?

జానపద ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన మహారాష్ట్ర నృత్యకారిణి, గాయని విఠాబాయి భావు మంగ్ నారాయణ్ జీవితం తెరపైకి రాబోతున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టులో బాలీవుడ్ కథానాయిక శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా, లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కిస్తున్నారు. ఇంకా అధికారికంగా ప్రకటించని ఈ చిత్రంలోని తన పాత్ర కోసం శ్రద్ధ క్లాసికల్ డ్యాన్సర్‌గా శిక్షణ తీసుకుంటున్నట్లు సమాచారం. “ఈ చిత్రంతో మహారాష్ట్ర సంస్కృతిని జాతీయ స్థాయికి తీసుకెళ్లడానికి ప్రయత్నాలు చేస్తుంది చిత్రబృందం. ఇందులో క్లాసికల్ డ్యాన్సర్‌గా కనిపించనుంది శ్రద్ధ. ప్రస్తుతం దీని కోసం వర్క్‌షాప్‌లకు హాజరవుతుందామె. నవంబరులో ఈ సినిమాను పట్టాలెక్కించనున్నార”ని శ్రద్ధ సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి ‘స్త్రీ 2’తో దెయ్యంగా ప్రేక్షకుల్ని పరుగులు పెట్టించిన ఆమె.. క్లాసికల్ డ్యాన్సర్‌గా ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి.

# సూర్య, వెంకీ అట్లూరి ప్రాజెక్ట్ కి భారీ ఓటిటి డీల్?



ప్రస్తుతం మన టాలీవుడ్ దర్శకులు ఇతర ఇండస్ట్రీ హీరోస్ కి ఎలాంటి హిట్స్ ఇస్తున్నారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అలాంటి దర్శకుల్లో యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు వెంకీ అట్లూరి కూడా ఒకరు. మరి వెంకీ నుంచి నెక్స్ట్ సినిమాగా తమిళ స్టార్ హీరో సూర్యతో ఓ సాలిడ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ వస్తుండగా ఈ సినిమాకి ఓ భారీ ఓటిటి ధర వచ్చినట్టుగా తెలుస్తుంది. ఈ సినిమాని లీడింగ్ ఓటిటి సంస్థ ఒకటి ఏకంగా 80 కోట్లు వెచ్చించి హక్కులు కొనుగోలు చేసినట్టుగా టాక్. ఇది మాత్రం ఈ కాంబినేషన్ కి ఒక భారీ మొత్తమే అని చెప్పాలి. మరి సార్, లక్కీ భాస్కర్ లాంటి సినిమాలు డెలివర్ చేసిన వెంకీ అట్లూరి ఇపుడు ఎలాంటి సినిమా అందిస్తాడో అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరి ఆ అంచనాలు ఈ ప్రాజెక్ట్ అందుకుంటుందో లేదో చూడాలి. ఇక ఈ చిత్రానికి సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ వారు నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.

Printed Published and Owned by RAJESH BOLLEPAKA Printed at Amulya Publications and Printers Graphics.H.No:2-19/1 Thatikayala Dharmasagar, Hanmakonda.506151 and Published at H.No:2-19/1, Thatikayala, Dharmasagar, Hanmakonda 506151 Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710. Contact:9493669669 Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in